ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖ తీరానికి రిపేరు !



- రూ.200 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి డిపిఆర్
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, సముద్ర కాలుష్యంపై యంత్రాంగం ప్లాన్
- కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకూ పనుల ప్రతిపాదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ తీరం... ఆనందాలకు, ఆహ్లాదానికి 'హారం'. ఈ సాగరం కాలుష్య కాసారం కాకుండా కట్టుదిట్టమైన చర్యల వైపు విశాఖ జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను రూ.200కోట్లతో పంపడం విశేషం. రాష్ట్రం ఈ డిపిఆర్‌ను కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆమోదింపజేసుకోవాల్సి ఉంది. నగరంలోని కోస్టల్ బ్యాటరీ నుంచి భీమునిపట్నం వరకూ తీరం వెంబడి రక్షణ చర్యలు తీసుకోనున్నారు. తీరం కోతకు గురికాకుండా గోడలు కట్టడం, ఈ తీరంలో 20కి పైగా ఉండే బీచ్‌లను పోషించడం, మట్టి దిబ్బల స్థిరీకరణ, సముద్ర గోడల నిర్మాణం వంటి చర్యల కోసం రూ.200కోట్లను వెచ్చించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధుల కోసం కేంద్రం వంక చూస్తోంది. 90 శాతం నిధులు రాబట్టేందుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ)కి ఈ ప్రతిపాదనలు కాస్తా సమర్పించాల్సి ఉంది.

విపత్తుల ప్రమాదాన్ని నివారించడమే లక్ష్యం...

హుదూద్ వంటి తుపానులు సంభవించే సందర్భాల్లో విపరీతమైన విధ్వంసాన్ని విశాఖ ప్రజలు, ఉత్తరాంధ్ర వాసులు చవిచూసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు కారణమైన గ్లోబల్ వార్మింగ్ (పర్యావరణ కాలుష్యం) కారణంగా సముద్ర మట్టం ప్రతి సంవత్సరమూ ఒక మీటరు పైకి లేస్తుందంటూ ఆంధ్రా యూనివర్శిటీకి చెందిన సముద్ర అధ్యయన పరిశోధకుల బృందం నివేదిక తాజాగా బయటపెట్టింది. దీని ప్రకారం వచ్చే 70 ఏళ్లలో తీర ప్రాంత నగరాలను ప్రపంచంలోని సముద్రాలు ముంచెత్తుతాయన్నది ఆ నివేదిక సారాంశం. విశాఖ అందుకు మినహాయింపు కాదన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం తీరం తీవ్రమైన కోతకు గురౌతుందన్నది తాజా నివేదిక. గతంలో పలుమార్లు అలల కారణంగా ఒడ్డు (తీరం) తీవ్రమైన కోతకు గురై కొట్టుకుపోయింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పోర్టు అథారిటీ ఆధ్వర్యాన బీచ్ నౌరిష్‌మెంట్ (తీర రక్షణ) చర్యలు తీసుకుంటూనే ఉన్నా విపత్తులొస్తే ఆపే శక్తి తీరానికి ఉండేలాగ ప్రణాళికలను ప్రస్తుతం తయారు చేయడం విశేషం. రుషికొండ బీచ్ గడిచిన ఏడాది కాలంలో చాలావరకు కోతకు గురైంది. తీర కోతను తగ్గించడానికే రూ.200కోట్లతో డిపిఆర్ సిద్ధమైంది.

ఏయే ప్రాజెక్టులను ప్రతిపాదించారంటే...

రూ.160 కోట్లతో స్ట్రక్చరల్ మిటిగేషన్ (ఇంజినీరింగ్ చర్యల దిశగా) అంటే విపత్తుల తీవ్రతను తగ్గించే నిర్మాణాలకు సంబంధించిన ప్రాజెక్టులను భీమిలి మత్స్యకారుల పడవలు దిగే ప్రాంతమైన మంగమారిపేట, నగరంలోని పెదజాలారిపేట, జాలారి ఎండాడ, నుంచి వాసవానిపాలెం నుంచి శివగణేష్ నగర్ వరకూ సముద్ర గోడలకు ప్రతిపాదన చేశారు. గోకుల్ పార్కు వద్ద గ్రోయిన్స్‌కు ప్రతిపాదన ఉంది. భీమిలి బీచ్‌రోడ్డు, తోటవీధి ఆర్‌కెబీచ్ (సబ్‌మెరైన్ మ్యూజియం) ప్రాంతంలో రిటెన్షన్ వాల్స్ నిర్మాణానికి డిపిఆర్‌లో పేర్కొన్నారు. రుషికొండ వద్ద బీచ్ పోషణ చర్యలు, చేపల ఉప్పాడ వద్ద దిబ్బల స్థిరీకరణ ప్రాజెక్టులో కీలకంగా ఉంటాయి. ఈ రూ.200కోట్ల తీర కోత నియంత్రణ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదిస్తుందా? లేదా అన్నది చూడాల్సిందే.

స్వాట్‌ను ఉపసంహరించు కోవాలి

సిఐటియు

మీడియాతో మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు, చిత్రంలో రాజు

ప్రజాశక్తి - అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

కార్మిక పోరాటాల అణచివేతకై ఉద్దేశించిన స్వాట్‌ను ప్రభుత్వం ఉపసంహరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. అనకాపల్లిలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, కార్మికుల ఆందోళనలను అణిచి వేయడానికి అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రత్యేక దళాన్ని (స్వాట్) ఏర్పాటు చేయడమంటే నిరంకుశ చర్యలకు దారి తీయడమే అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో కార్మికులు, ప్రజలు తమ సమస్యలపై నిరసన తెలియజేసే హక్కు ఉందన్నారు. దీనికి భిన్నంగా ఉగ్రవాదులను అణచి వేసేటట్టు కార్మిక పోరాటాలని అణచడానికి స్వాట్ దళాన్ని 30 మందితో ఏర్పాటు చేయడం, ప్రత్యేక శిక్షణ ఇవ్వడం తగదన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావడానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటించి, ప్రభుత్వ ఆస్తులను కట్టబెడుతోందన్నారు. వచ్చిన కంపెనీలు కార్మికుల చట్టాలు అమలు చేయకుండా, తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నాయని, ప్రశ్నించే కార్మిక వర్గాల గొంతు నొక్కడానికి ఈ స్వాట్ దళం పనిచేసేటట్టు జిల్లా ఎస్‌పి ప్రకటించడం దుర్మార్గం అని పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో నిత్యం అనేక ప్రమాదాలు చోటు చేసుకోవడం, కనీస వేతనాలు అమలు జరపకుండా కార్మికులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. వీటిపై కార్మికులకు భద్రత, రక్షణ కల్పించకుండా తమకు భద్రత కావాలని అడిగే వారిని ఈ స్వాట్ టీమ్స్ ద్వారా అణచివేయాలని చూడటం దారుణం అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మిక సంఘాలు, కార్మికులు పోరాడితేనే ఆ కుటుంబాలకు సరైన పరిహారం అందుతుందన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అది కూడా లేకుండా చేయడానికి స్వాట్ టీములు నియమిస్తే కార్మికులను ఎవరు ఆదుకుంటారని ప్రశ్నించారు. బడా కార్పొరేట్లను, పెట్టుబడిదారులను సంతృప్తి పరచడానికే ఈ పోలీసులను వినియోగిస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. స్పీడ్ ఆఫ్ బిజినెస్ పేరుతో యజమానులకు లాభాలను తెచ్చిపెట్టే ధోరణిలో కాకుండా లక్షలాదిమంది కార్మికుల కోసం ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ హక్కులను హరించే

మిగతా 2లో..

అధిక ధరలపై నేడు సిపిఎం ధర్నా

వార్త 2లో..

బకాయిలు చెల్లించాలని పాఠశాలల శానిటేషన్ వర్కర్ల ధర్నా

వార్త 2లో..

డ్వాక్రా మహిళల సొమ్ము రూ.30 లక్షలు స్వాహా

వార్త 6లో..

నేటి నుంచి తాజ్ గేట్‌వే మూసివేత

వార్త 8లో..

కార్మికవర్గ ఆదర్శమూర్తి ఎవి.రమణారావు

- వర్ధంతి సభలో ఎంవిఎస్.శర్మ

వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పీర్‌లెస్‌లో ఉద్యోగం చేసుకుంటూ, మొత్తం కార్మికవర్గానికే నాయకత్వం వహించిన ఆదర్శమూర్తి ఎవి.రమణారావు అని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ కొనియాడారు. జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో రమణారావు 4వ వర్ధంతిని బుధవారం జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రమణారావు చిత్రపటానికి ఎంవిఎస్.శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ, విశాఖ పీర్‌లెస్‌లో సాధారణ ఉద్యోగి అయినప్పటికీ వారి యూనియన్‌కు జాతీయ కార్యదర్శిగా రమణారావు బాధ్యత చేపట్టారన్నారు. విశాఖలో మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం వార్వా సంస్థ స్థాపించి అపార్ట్‌మెంట్ సంఘాలను ఐక్యపర్చడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. సాహితీవేత్త కాకపోయినా సాహితీ వేత్తలను ఒకేవేదికపైకి తెచ్చారన్నారు. ఆయన ఆశయాలు కోసం పోరాటం చేయడమే సరియైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, వి.కృష్ణారావు, ఎం.రాంబాబు, వై.సత్యవతి, పి.వెంకటరావు, నాయుడు, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

కోరాపుట్-జగదల్‌పూర్ సెక్షన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :కోరాపుట్-జగదల్పూర్ సెక్షన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. భద్రతను పెంచడం, సౌకర్యాలను మెరుగుపరచడం, డబుల్ లైన్ పనులతో సహా కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సివిల్ ఇంజినీరింగ్, ఆపరేషన్స్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, కమర్షియల్ అండ్ సేఫ్టీ తదితర విభాగాలకు చెందిన సీనియర్ అధికారులతో కలిసి డిఆర్‌ఎం పరిశీలించారు. డిలిమిలి, దంతెవారా స్టేషన్లను సందర్శించిన

మిగతా 2లో..

సాంస్కృతిక కార్యక్రమాలకు టౌన్ హాల్

- జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

టౌన్ హాల్‌ను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో ప్రసిద్ధి చెందిన టౌన్ హాల్‌ను సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వినియోగించేలా చూడాలని జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం టౌన్‌హాల్, పాత మున్సిపల్ కార్యాలయ భవనాలను ఆయన పరిశీలించారు. 1904లో నిర్మించిన టౌన్ హాలు పాడై నిరుపయోగంగా ఉన్న తర్వాత పునరుద్ధరించినట్లు కమిషనర్‌కు జివిఎంసి అధికారులు వివరించారు. ఇది వైజాగ్‌పటం క్లబ్‌గా నిర్వహించబడుతుందని చెప్పారు. ఇక్కడ మరుగుదొడ్లు నిర్మించాలని కమిషనర్‌ను కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ టౌన్ హాల్‌ను సాంస్కృతిక కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీర్ పివివి.సత్యనారాయణను ఆదేశించారు. అంతకుముందు పాత మున్సిపల్ కార్యాలయంలో నడుస్తున్న ఎపిహెచ్‌ఆర్‌డి ఇనిస్టిట్యూట్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ భవనం పైభాగంలో వర్షం నీరు నిల్వ ఉండి, నీరు లీకై సీలింగు దెబ్బతింటుందని గమనించి, సరిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, డిప్యూటీ ఎడ్యుక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస ప్రసాద్, ఎఎంఒహెచ్ డాక్టర్ కృష్ణంరాజు, ఎసిపి ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

స్పాట్‌ను ఉపసంహరించుకోవాలి

విధంగా ఈ స్పాట్ టీమ్‌ను నియామకం జరిగినట్లు భావిస్తున్నామన్నారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తారు తప్ప కావాలని ఎవరూ ఆందోళనలు చేయరని గుర్తించాలని హితవుపలికారు. చేతనైతే రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి తప్ప ప్రశ్నించే వారి గొంతు నొక్కడానికి ఇటువంటి దళాలను ఏర్పాటు చేయడం సరి కాదన్నారు. వెంటనే ఈ దళాన్ని ఉపసంహరించాలని డిమాండ్‌చేశారు.

కోరాపుట్-జగదల్‌పూర్ సెక్షన్‌లో డిఆర్‌ఎం తనిఖీలు

ఆయన సౌకర్యాలు, సిబ్బంది క్వార్టర్లు, సరుకు నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచడంపై పలు సూచనలు చేశారు. అనంతరం లెవల్ క్రాసింగ్ గేట్ కెకె-103 వద్ద, డిఆర్‌ఎమ్ సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించారు

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి : ఆర్‌డిఒ శ్రీలేఖ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని విశాఖపట్టణం ఆర్‌డిఒ పి. శ్రీలేఖ అన్నారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సబ్ డివిజనల్ విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ, పోలీసు అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఇతర విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. సమావేశంలో భాగంగా ఇప్పటి వరకు నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీలేఖ మాట్లాడుతూ, ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. డివిజన్, మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ, దర్యాప్తు విషయంలో జాగ్రత్త వహించాలని, బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో నగర పరిధిలోని ఎసిపిలు, తహశీల్దార్లు, జివిఎంసి అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మధుమేహం కట్టడి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పోషకాహారంతో మధుమేహ వ్యాధిని కట్టడి చేయవచ్చని న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి చెప్పారు. నవంబర్ 14 ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా బుధవారం నోవాటెల్ హోటల్‌లో ఆమె మాట్లాడుతూ, బాదం వంటి పోషకాహారం తీసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో రితికాసమద్దర్ పాల్గొన్నారు.

అధిక ధరలపై నేడు సిపిఎం ధర్నా

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగినందున సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పప్పులు, బియ్యం, వంటనూనె, పెట్రోల్, డీజిల్ వంటి ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించకపోగా విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను భారీగా పెంచి ప్రజల నడ్డివిరగ్గొడుతున్నాయని, ఈ ధరా భారాలు తక్షణమే తగ్గించాలని జిల్లాలో అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద గురువారం చేపట్టే ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదంచేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రైతుల పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దుచేసి పాత కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు జరపాలని, కార్మికులకు కనీసవేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని తదితర ప్రజా సమస్యలపై దేశవ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు పాదయాత్రలు, గ్రూపు మీటింగులు, ఇంటింటికి కరపత్రాలు పంపిణీ వంటి కార్యక్రమాలు విశాఖ జిల్లాలో అన్ని ప్రాంతాల్లోనూ సిపిఎం నిర్వహించిందని తెలిపారు. దీనికి ముగింపుగా గురువారం ఉదయం 10 గంటలకు అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద, మధురవాడ జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నాలు చేపడుతున్నట్లు వివరించారు.

ధర్నాలో నినదిస్తున్న పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్లు

బకాయిలు చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ వర్కర్లకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాఠశాలలు, కాలేజీల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు జి.మంగ్రశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ, గత పదేళ్లుగా పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ను నియమించాలని, వర్కర్లకు మాస్కులు, చీపుర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాజకీయ కక్ష సాధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇప్పుడు ఇస్తున్న రూ.6 వేలు వేతనాన్ని పెంచాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బంగారమ్మ, వసంత, టి.లక్ష్మి, వై.లక్ష్మి, కె.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో కల్తీపై అసెంబ్లీలో చర్చించాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : హోటల్స్‌లో కల్తీ ఆహారంపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ జన జాగరణ సమితి ఆధ్వర్యాన మద్దిలపాలెంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ, కల్తీ ఆహారం అమ్మేవారు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమన్నారు. కల్తీ ఆహారం తిని కేన్సర్ బారిన పడకుండా ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేసే ఫుడ్ సేఫ్టీ అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. హోటల్స్‌లో కిచెన్, డీ ఫ్రిడ్జ్‌లను పరిశీలించిన తర్వాతే భోజనం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, దేవరశంకర్, జివిఎన్.సంజయ్, కృష్ణ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM O.S.60/2024

Between:
State Bank of India, SME Centre Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And:
M/s. Vijaya Lakshmi Steels & Crockery & another ...Defendants
SUMMONS
To,
D-1: M/s. Vijaya Lakshmi Steels & Crockery, Rep. by its Prop: Rahul Dalmia, Shop No.15, Sector-2, Shopping Complex, Ukkunagaram, Visakhapatnam-32
D-2: Rahul Dalmia, S/o. Ramesh Kumar Dalmia, Prop. of M/s. Vijaya Lakshmi Steels & Crockery, R/at D.No.30-3-11/15, Assam Gardens, Neelammavepa Chettu, Dabagardens, Visakhapatnam-20
Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **28-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate,
Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM I.P. 54/2023

Between:
Sri Belamara Syamsundar ...Petitioner
And:
Boddapati Venkata Ramana Murthy Naidu & 3 others ...Respondents
NOTICE
To,
R-3: Nakka Kanakaratnam, W/o. late Satyanarayana, Hindu, aged about 40 years, R/at D.No.9-8-223, VUDA Colony, Gajuwaka, Visakhapatnam-26.
R-4: R. Ram Srikanth, S/o. Narayana, Hindu, aged about 45 years, R/at D.No.12-5-6, Sagara Durga Nursing Home Line, Krishna Nagar, Visakhapatnam-02
Please take notice that the above named petitioner filed the above Insolvency petition for declaring him as insolvent against you (Respondents) before this Hon'ble Court and the matter is coming for your appearance and the matter stands posted to **28-11-2024,** on that day you are personally or through Advocate attend before this Hon'ble Court at **10:30 A.M.,** failing which the matter will be decided as per law in your absence
(By Order of the Hon'ble Court)
SHAIK. ANARKALI, SHAIK NAUSHAD AHMED,
Advocates
Visakhapatnam, Cell: 9010810570.

అప్పారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

కెజిహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పిఎన్.అప్పారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎన్.అప్పారావు నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం సిటీ, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు బుధవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, గౌరవాధ్యక్షులు రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బివిఎస్.ప్రసాద్, సీనియర్ టెక్నీషియన్ నాగు, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ పార్వతీపురం 2వ అదనపు జిల్లా మరియు స్పెషన్సు జడ్జి వారి కోర్టులో
Crl.M.P.No. /2024 in Crl. R.P.No.15/2022

Between :
ఐతం లక్ష్మీభాయి సింగ్ @ లక్ష్మీ సింగ్...పిటీషనరు
And :
1. ఐతం రామమోహనరావు (died)
2. ఐతం సర్వమంగళ .....రెస్పాండెంట్లు
To
రెస్పాండెంటు నెం.2 :
ఐతం సర్వమంగళ W/o రామమోహనరావు, గృహ కృత్యము, నివాసము, డోరు నెం. 54-7-31, ఇసుకతోట, విశాఖపట్నం-22, Pin. 520022
పై నెంబరు పిటీషనులో మీరు రెండవ రెస్పాండెంటు అయి ఉన్నారు. పై నెంబరు పిటీషను **తే 20-11-2024**దీకి మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదీన మీరు **ఉదయం 10-30 గం॥**లకు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలసినదిగా ఆజ్ఞాపించడమైనది. లేని ఎడల కోర్టువారు మీ పరోక్షమందు తీర్మాణం చేయుదురు.
//కోర్టువారి ఆర్డరు ప్రకారం//
బదే వెంకటనాయుడు, B.A., BL,
పార్వతీపురం. న్యాయవాది, పార్వతీపురం.
తే 13.11.2024దీ Cell: 9885147583

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు టెక్కలి
OS.55/2023

Between:-
శిర్ల పార్వతి వగైరాలు ....వాదులు
And:
శిర్ల శ్యామసుందరరావు వగైరాలు ....ప్రతివాదులు
To:
1వ ప్రతివాది: శిర్ల శ్యామసుందరరావు, S/o లేటు చంద్రయ్య, 52 సంవత్సరములు, డోర్ నెం:84-4-63, పోస్టు ఆఫీసు వీధి, జ్ఞానాపురము, విశాఖపట్టణము.
పై నెంబరు OS.55/2023 దావాలోగల వాదులు, ప్రతివాదులు పై Partition దావా దాఖలు చేయగా, సదరు OS.55/2023 నెంబరు దావా **తే 28-11-2024దిన పైకోర్టులో వాయిదా అయిఉన్నది.** ఆదినమున 1వ ప్రతివాది పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసు కొనవలయును. లేని ఎడల సదరు దావా OS.55/2023ను మీ పరోక్షమందు విమర్శించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
పేడాడ బాబూరావు
వాదులు తరుపున న్యాయవాది,
టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL CHIEF JUDICIAL MAGISTRATE JUDGE AT GAJUWAKA DVC No. 29 / 2023

Between:
Gode Vimochana Rani ... Petitioner
And:
Gode Vijaya Chakravarthy and 4 others ... Respondents
To
RESPONDENT - 2:
Gode Ratna, W/o. Gode Purusotham Age 50 years, Flat No. 303, K.S.Kumar Towers, Road-4, Beside Krishna Devaraya Kalyan Mandapam, Old Kannavanipalem, Visakhapatnam. Cell : 8179036487
పై నెంబరు పిటిషన్లో రెస్పాండెంట్ నెం.2 హాజరు నిమిత్తం ది 06-12-2024తేదీ నాటికి వాయిదా వేసినారు. పైన పేర్కొన్న సదరు రెస్పాండెంట్ నెం.2 వాయిదా **తేదీ 06-12-2024న ఉదయం గం. 10.30 ని॥లకు** శ్రీకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 06-12-2024
MGW DAVID RAJU
M.PRAVEENA, P.K.PRASAD
వాది తరుపు న్యాయవాదులు,
గాజువాక విశాఖపట్నం.
సెల్: 9246992699

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NARSIPATNAM EP.14/2023 IN O.S.30/2018

Between:
Adigarla RajuBabu .... D.Hr/Plaintiff
And:
Malasala Mohanrao ....J.Dr/ Defendant
To:
Malasala Mohanrao, S/o.Apparao, Hindu, aged about 42 years, Residing at Kovvuru Village & post, Rolugunta mandal, Visakhapatnam(old) / Anakapalli (New) District.
NOTICE
Take notice that the above named D.Hr/plaintiff has filed the above suit against you for recovery of money. The Honourable Court ordered service of summons by way of paper publication. You are hereby summoned to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above EP. 14/2023 in OS.30/2018 on **06-12-2024 at 10.30 A.M.,** if failed to appear on that day, the suit will be heard and determined in your absence.
(By Court order)
K. VENKATA RAMANA
Advocate, K.Thangedu Village, Kotauratla(M.D), Narsipatnam, Anakapalli (Dist).
NARSIPATNAM Cell : 9490060362.
Date: 13/11/2024.

శిథిల భవనం.. అరకొర సౌకర్యాలు!

- శాఖాగ్రంథాలయ నిర్వహణకు అగచాట్లు
- అవస్థలు పడుతున్న పాఠకులు, పట్టని అధికారులు
- పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాని పుస్తకాలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందాన ఉంది భీమిలిలోని శాఖా గ్రంథాలయం పరిస్థితి. ర్యాక్‌ల నిండా విలువైన విజ్ఞానం, సమాచారం ఉన్న పుస్తకాలు, అనునిత్యం పాఠకులకు తాజా సమాచారం అందించే పీరియాడికల్స్, మేగజైన్స్, ఇతరత్రా పఠన పరికరాలు అన్ని అందుబాటులో ఉన్నా, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దుస్థితి ఇక్కడ ఉంది. దీనికి కారణం గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడం, పాఠకులు కూర్చొనేందుకు కుర్చీలు, బెంచీలు లేకపోవడమే. గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో పౌరగ్రంథాలయాల సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలంటే ప్రభుత్వం, అధికారులు తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భీమిలిలోని శాఖాగ్రంథాలయంలో అరకొర సౌకర్యాలతో పూర్తిస్థాయి గ్రంథాలయ సేవలు అందని పరిస్థితి ఉంది.. ఇక్కడి గ్రంథాలయంలో జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్షలు, నవలలు, కళలు, సంస్కృతి, సాహిత్యం, చరిత్రకారులు, జాతీయ నేతల జీవిత విశేషాలను తెలిపే పుస్తకాలు దాదాపు 26 వేలు ఉన్నాయి. తెలుగు దినపత్రికలు 6, ఇంగ్లీష్ దినపత్రికలు 3 ఉన్నాయి. రోజుకు సుమారు 50 మంది

ర్యాకుల్లోనే పదిలంగా ఉన్న గ్రంథాలయ పుస్తకాలు

పాఠకులు వస్తుంటారు. అయితే వీరికి సరిపడా కుర్చీలు లేవు. రీడింగ్ టేబుల్, 30 కుర్చీలు అదనంగా అవసరం. ఇందుకోసం దాతల సాయం కోరుతున్నారు. ఉదయం 8

మరమ్మతులకు గురైన గ్రంథాలయ భవనం

నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు గ్రంథాలయ పని వేళలు.

మరమ్మతులకు గురైన భవనం

2008కి ముందు వరకు స్థానిక శాఖాగ్రంథాలయాన్ని అద్దె భవనంలో నిర్వహించేవారు. 2008 లో అప్పటి రాజ్యసభ సభ్యులు టి సుబ్బిరామిరెడ్డి పార్లమెంట్ కోటా అభివృద్ధి నిధులతో సామాజిక భవనం నిర్మించగా, అప్పటి నుంచి గ్రంథాలయం ఆ భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం మరమ్మతులకు గురైంది. పాడైన గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయాలని, అదనపు సౌకర్యాలు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

రామవరానికి ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం :మండలంలోని రామవరం గ్రామపంచాయతీలో గృహ అవసరాలకు మూడు ఫేజ్‌ల్లో నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రత్యేక విద్యుత్‌లైన్‌ను బుధవారం ప్రారంభించారు. దీనిపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ మధు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్, స్థానిక సర్పంచ్ ఎర్ర రాజు, ఎంపిటిసి కృష్ణ, మాజీ సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సాగరదుర్గమ్మ ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి - పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం సాగరదుర్గమ్మ ఆలయం ప్రారంభం, విగ్రహప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు బి.సత్యనారాయణ దంపతులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.. నెల్లిమర్ల దుర్గాపీఠాధిపతి, చిన్న స్వామి, విజయనగరం జెడ్‌పిచైర్మన్ చిన్న శ్రీను, వుడా మాజీ చైర్మ విజయనిర్మల, ఎంపిపి రాంబాబు, విశాఖ జెడ్‌పి వైస్‌చైర్మన్ ఎస్ గిరి బాబు, మాజీ జెడ్‌పిటిసి కె.దామోదరరావు, పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకృష్ణాపురంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం సోషల్ మీడియాలో ఈ విషయం వెలుగులోకి రావడంతో గురుకుల పాఠశాల వద్దకు అధికారులు, పోలీసులు వెళ్లి ఆరా తీసారు.కొన్ని రోజులుగా 9 మంది విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రత్న వల్లి తెలిపారు. వీరిలో 5వ తరగతి విద్యార్థి పి.రవీంద్ర కుమార్‌కు జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. మరో ఎనిమిది మందిని స్థానిక పిహెచ్‌సిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు.

లింగాపురంలో చోరీపై విచారణ

ప్రజాశక్తి-కోటవురట్ల: లింగాపురం గ్రామంలో మంగళవారం రాత్రి చోరీ ఘటనలపై పోలీసులు, క్లూస్‌టీం విచారణ చేపట్టారు. చింతల వరలక్ష్మి ఇంటిలో రెండున్నర తులాల బంగారం చోరీపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ క్లూస్‌టీమ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. కోటవురట్ల గ్రామంలో ఫాస్ట్ ఫుడ్ దుకాణం నడుపుతున్న బాధితుడు రాత్రి 9:30 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా, అదే సమయంలో తన ఇంట్లోంచి దొంగ పారిపోతుండ గమనించి కేకలు వేయగా, చోరీ 11 తులాల బంగారంలో ఎనిమిదిన్నర తులాలు అక్కడే జార విడిచి, మిగతా రెండున్నర తులాలతోపాటు రూ.ఐదు వేలనగదును పట్టుకుపోయాడన్నారు.

న్యుమోనియాను నిర్లక్ష్యం చేయడం తగదు

'సాన్స్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : పిల్లలో న్యుమోనియా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహనకు ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 28 వరకు సాన్స్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పి.జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను జిల్లా ప్రోగ్రాం అధికారుల సమక్షంలో డిఎంహెచ్ఒ ఆవిష్కరించారు. దగ్గు, జలుబు, అధిక జ్వరం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు, శ్వాస సమయంలో డొక్కలు ఎగుర వేయటం వంటి లక్షణాలుంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని మందులు వాడడం అవసరమన్నారు. పిల్లల్లో న్యుమోనియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమౌతుందన్నారు. డిఐఒ డాక్టర్.ఎస్. జీవనరాణి, మాట్లాడుతూ న్యుమోనియా నుంచి రక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.కార్యక్రమంలో డిఎల్ఒటిఒ డాక్టర్ .పూర్ణేంద్ర బాబు, డిఐఒ ఎస్.జీవనరాణి, డిపిఎంఒ .బి.ఉమావతి, ఆర్‌బిఎస్‌కె డా.ఎన్.వి.సమత, జిల్లా సమన్వయకర్త, బి.నాగేశ్వర రావు, డెమో, తులసి, డిఎంఒ డా.జగదీష్ ప్రసాద్, డిఎస్ఒ డా.నళిని, మెడికల్ ఆఫీసర్, డిపిహెచ్ఎన్ఒ మనోరమ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా బాలల సైన్స్ కాంగ్రెస్

ప్రజాశక్తి -మధురవాడ : బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి(జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న జరుగుతున్న ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. ముఖ్యంగా సముద్ర శాస్త్ర వింతలు, విశేషాల నుంచి నానో సైన్స్, కృత్రిమ మేధ వరకు శాస్త్రవేత్తల ప్రసంగాలను ఏర్పాటు చేయడంతో విజ్ఞానదాయకంగా సైన్స్ కాంగ్రెస్ కొనసాగుతోంది. గీతంలో జరుగుతున్న సైన్స్ కాంగ్రెస్‌లో బుధవారం జరిగిన శాస్త్రవేత్తల ప్రసంగాలు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం ఆసక్తికరమైన చర్చలకు వేదికగా మారింది. ఎన్ఐఒ శాస్త్రవేత్త డాక్టర్ వివిఎస్ఎస్.శర్మ తన ప్రసంగంలో సముద్రాలలోని జీవరాశులు వాటిలో ఔషధ గుణాలు, సముద్ర గర్భంలో లభించే ఖనిజాలు, సముద్ర అలల నుంచి విద్యుత్తు ఉత్పాదన వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు ముఖ్యంగా ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం సముద్రంపై ఎలా ఉంటుందో తెలియజేశారు. తుఫానులను ముందుగా గుర్తించడం, తీర ప్రాంత కాలుష్యం తీసుకోవలసిన జాగ్రత్తలను ఆసక్తికరంగా వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డ్ గ్రహీత ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ ఒకప్పుడు కలిసి ఉన్న భూభాగం ఖండాలుగా విడిపోవడానికి దారితీసిన పరిస్థితులను వెల్లడించారు.సముద్ర లోతులలోఅధిక ఉష్ణోగ్రతల వద్దజీవరాశుల ఉనికిని వివరించే విశేషాలను వివరించారు. . భారత ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న సముద్రయాన్ ప్రాజెక్టు విశేషాలను

ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న విద్యార్థులు

వెల్లడించారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్.వేణుగోపాల్ నానో సైన్స్ విశేషాలను వివరిస్తూ వ్యవసాయ రంగంలో అధిక దిగుబడులు సాధించడానికి నానో టెక్నాలజి ఉపయోగ పడనున్నదని తెలిపారు. భవిష్యత్తులో నానో క్రిమిసంహారకాలు, ఎరువులు అందుబాటులోకి రానున్నాయని అలాగే నీటి నాణ్యత, ఆహార భద్రతలో సహితం నానో టెక్నాలజి ఉపయోగించనున్నట్లు వివరించారు. కృత్రిమ మేధ సమీప భవిష్యత్తులో వివిధ రంగాలను ఏవిధంగా ప్రభావితం చేయనున్నదో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవిశంకర్ వివరించారు. గీతం జీవ శాస్త్ర విభాగాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ పట్టణ వ్యర్థాల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనున్న బాలల సైన్స్ కాంగ్రెస్‌లో దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఒంటరి మహిళపై హత్యాయత్నం

ప్రజాశక్తి- గాజువాక: మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సీతారాంనగర్‌లో చోటు చేసుకుంది. ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి సిఐ పార్థసారథి తెలిపిన వివరాలివి. సీతారాంనగర్ కాలనీలో నివాసముంటున్న ఒంటరి మహిళ నీలం పద్మ ఇంటి తలుపులను మంగళవారం రాత్రి ఇద్దరు మహిళలు వచ్చి కొట్టారు. తలుపు తీసేసరికి వచ్చిన ఇద్దరు ఆడవాళ్ల నీలం పద్మను చంపడానికి ప్రయత్నించగా, గట్టిగా కేకలు వేయడంతో వారు పరారయ్యారు. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి సిఐ చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రియల్ పోలీసుల అదుపులో నకిలీ పోలీసు

ప్రజాశక్తి - ఆరిలోవ : పోలీసుగా అవతారమెత్తి మోసాలకు, దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని ఆరిలోవ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి.. పాడేరు ప్రాంతానికి చెందిన వెలుగుల వెంకటరమణ ఈ గత నెల 21న తెల్లవారు జామున తెన్నేటి పార్కు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న ఇమ్మలపల్లి అప్పారావుకు చెందిన బైక్‌ను పోలీసు యూనిఫాంలో ఉన్న వెలుగుల వెంకట రమణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసి వస్తానని చెప్పి తీసుకు వెళ్ళాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో మోసపోయినట్టు గమనించిన అప్పారావు, ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసారు. దీనిపై కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు, బుధవారం నకిలీ పోలీసు వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. ఇదే వ్యక్తి గతంలో టూ టౌన్‌లో ఇదే తరహా మోసం కేసులో అరెస్టు అయ్యాడు. ఇటీవల సబ్బవరంలో కూడా నకిలీ పోలీసు అవతారం ఎత్తి బైక్‌ను, సెల్ ఫోన్‌ను ఎత్తుకెళ్ళినట్టు పోలీసులు తెలిపారు. ఈ రెండు కేసుల్లో వెంకటరమణను అదుపులోకి తీసుకున్నట్టు సిఐ మల్లేశ్వరరావు తెలిపారు.

బిపిఒ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి బ్రాంచ్ పోస్టాఫీసర్ దాసరి సత్య ప్రవీణ్ (23) అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నవరం రైల్వే స్టేషన్ రోడ్డుకు చెందిన సత్యప్రవీణ్. చింతలపూడి పోస్టాఫీసర్‌గా పనిచేస్తున్నాడు ఉద్యోగ రీత్యా దేవరాపల్లి స్టేట్ బ్యాంక్ లైన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన చివరిగా తన రూమ్‌మేట్ కొల్లి దేముడు నాయుడుకు దేవరాపల్లిలో మంగళవారం 11.30 గంటల సమయంలోకనిపించాడు. ఆ తర్వాత కనిపించలేదు. బిపిఒ సత్యప్రవీణ్ తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి కొత్తకోట మెయిన్ రోడ్డులో మద్యం తరలించేందుకు బస్ కోసం ఎదురు చూస్తున్న కొత్తకోటకు చెందిన వ్యక్తి నుంచి వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కశింకోట : రెండు వేర్వేరు కేసుల్లో 47 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ మనోజ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని నరసింగపల్లి గ్రామం శివారు ఆర్ అండ్ బి రోడ్డు వద్దకు మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ మనోజ్ ఆధ్వర్యాన అక్కడకు వెళ్లగా చింతలపాలెం గ్రామానికి చెందిన చిత్తూరు చిన్న అప్పారావు అక్రమంగా 30 మద్యం బాటిళ్ళ కలిగి ఉన్నాడు. దీంతో ఆయన్ను అదుపులోకి తీసుకొని, 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మోసయ్యపేట గ్రామానికి చెందిన దుద్దేటి చిన్న రమణ 17 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, చిన్న రమణను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి -పద్మనాభం. మండలంలోని అనంతవరం సమీపంలో మంగళవారం రాత్రి ఆటోలో తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు. పట్టుకొని పద్మనాభం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు పద్మనాభం ఎస్ఐ సురేష్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

సీతమ్మధారలో దుస్తుల పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

ప్రజాశక్తి- సీతమ్మధార : విజయవాడ వరద సమయంలో విశేషసేవలు అందించిన జివిఎంసి 46వ వార్డు పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం జివిఎంసి ఆధ్వర్యంలో నూతన దుస్తులను డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా వరదలతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు శానిటేషన్ సిబ్బంది అందించిన సేవలు ఎంత చెప్పినా తక్కువేనన్నారు.ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. జివిఎంసి నిధులతో ఒక్కొక్కరికీ రెండు జతల దుస్తులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, కె.చిన్నా, సోమునాయుడు, వార్డు ఇన్స్పెక్టర్ సత్యం , సచివాలయం సెక్రటరీ రమేష్ ,వార్డు సూపర్వైజర్లు రామారావు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు

భీమునిపట్నం : విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు, జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో జెడ్సి పిల్లి ప్రేమ ప్రసన్నకుమారి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు.మహిళకు రెండు చీరలు, కార్మికునికి రెండు జతల దుస్తులు అందజేశారు. పిఎస్ఎస్ అధ్యక్షులు అక్కర మాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ బి మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు

చిల్లర వర్తకులకు హాకర్ జోన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం :తమకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, తొట్లకొండ వద్ద హాకర్ జోన్ నిర్మించి, ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి నాల్గో వార్డు తొట్లకొండ వద్ద బుధవారం జిల్లా ఫుట్పాత్, తోపుడుబళ్లు, ఫోటోగ్రఫీ కార్మిక వెల్ఫేర్ సొసైటీ (ఎఐటియుసి)ఆధ్వర్యంలో చిల్లర వర్తకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా ప్రధానకార్యదర్శి జి వామనమూర్తి మాట్లాడుతూ, తొట్లకొండ బీచ్ వద్ద ఉన్న చిల్లర వర్తకులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం అధ్యక్షులు కార్తీక్, నాయకులు శ్యామ్, రావి కృష్ణ, శివ, దేవుడమ్మ పాల్గొన్నారు

బాక్సింగ్‌లో సత్తాచాటిన షర్మిలకు అభినందన

ప్రజాశక్తి- ములగాడ : ఇటీవల భోపాల్లో జరిగిన బాక్సింగ్ ఛాంపియన్ షిప్లో సత్తా చూపి, పతకాలను సాధించిన మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ కు చెందిన ఆలేఖ్య, షర్మిలను బుధవారం అభినందించారు. బి షర్మిల 40 - 42 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా, రాణి లక్ష్మీబాయి బెస్ట్ ఉమెన్ ఛాంపియన్ షిప్ సాధించింది. ప్రతిభ చూపిన క్రీడాకారులతోపాటు వారికి మంచి శిక్షణ అందించిన కోచ్‌లు పోతిన ప్రసాద్ పాత్రుడు, ఎస్కె.ఆలీ, ఖనన్, సాయి కోచ్ సునీల్, హరి పాత్రుడు, సాయిలను అభినందించారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - వేపగుంట : ప్రపంచ దృష్టి దినోత్సవం, బాలల దినోత్సవం సందర్భంగా కంటి ఆరోగ్యంపై శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బుధవారం నాయుడుతోటలోని ఆసుపత్రిలో బహుమతులు అందజేసినట్లు హాస్పిటల్ డిజిఎం కె.బంగారురాజు తెలిపారు.నగరంలోని 86 పాఠశాలలకు చెందిన 415 మంది విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై చిత్రలేఖనం, వక్తృత్వం ఇతర పోటీలను నిర్వహించారు. విజేతలకు శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, ఆత్మకూరి కృష్ణ కుమార్ జనరల్ మేనేజర్ కే రాధాకృష్ణన్ బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డిజిఎం వి.రమేష్‌కుమార్, కె.వినోద్‌కుమార్, భువన కళ్యాణి, ఆలేఖ్య, జయ, దేవి, మంజుల పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఇళ్లను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను సంబంధిత లబ్ధిదారులు వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. బుధవారం తునివలస గ్రామపంచాయతీ నరసాపురం గ్రామంలో అర్బన్ ఇల్లు నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు.తహశీల్దార్ ఆనందరావు, హౌసింగ్ డిఇ రామకృష్ణ పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- గాజువాక : కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లింపు, బకాయి పడ్డ ఏడు నెలల జీతాల చెల్లింపు, ఉపాధి కోల్పోయిన వారికి ఉపాధి కల్పన, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరుతూ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం బిసి గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు అధ్యక్షులు జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ. ఉక్కు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల టెండర్లు సకాలంలో పూర్తి కానందున సుమారు ఆరు వందల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల విధానంలో మార్పులు చేసి, ఒకే సంస్థకు ఏడు జోన్ లు ఇవ్వకుండా ఒక్కొక్కరికీ ఒక్కో జోన్ మాత్రమే ఇవ్వాలని కోరారు.. కార్మికులకు బకాయి పడ్డ ఆరేడు నెలల వేతనాలను కాంట్రాక్టర్లు

బిసి గేటు వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

చెల్లించకపోయినా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంలో స్పందన లేదన్నారు. యాజమాన్యం వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు. నమ్మి రమణ, పి మసేను., సూర్య కుమార్, నందికి తాతారావు, కె వంశీ. యు అప్పారావు, పిట్ట రెడ్డి, శశిభూషణ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించాలని ఆందోళన

నిరసన వ్యక్తం చేస్తున్న మాధవధార ప్రజలు

ప్రజాశక్తి -మాధవధార : జివిఎంసి 50వ వార్డు మాధవధారలో బస్‌స్టాండ్ సమీపంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు చేరువలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తరలించాలని కోరుతూ మాధవధార ప్రాంతవాసులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. మద్యం దుకాణానికి దగ్గరగా జివిఎంసి హైస్కూలు, గాయత్రి విద్యామందిర్ ప్రైవేట్ స్కూలు ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాగే బస్‌స్టాప్‌కు అత్యంత చేరువలో మద్యం దుకాణం ఏర్పాటుతో మద్యం మత్తులో మందుబాబుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే జనావాసాలకు దూరంగా మద్యం దుకాణాన్ని తరలించాలని కోరారు. ఆందోళనలో మాధవధార ప్రజలు పప్పల రామచంద్రరావు, కూన సత్యనారాయణ, సనపల శ్రవణ్‌కుమార్, తర్లంగి ధర్మారావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సనపల ధనుంజయస్వామి, నూకరాజు, కూన పార్వతీ, పప్పల శ్రీదేవి పాల్గొన్నారు.

నొప్పులకు లయన్స్ ఆసుపత్రిలో శాశ్వత నివారణ చికిత్స

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని లయన్స్ కేన్సర్ జనరల్ ఆసుపత్రిలో మెడనొప్పి , వెన్నెముక నొప్పి, కేన్సర్ నిర్వహణకు సిఆర్మ్ ఫ్లోరోస్కోపీ, హైడెఫినిషన్ అల్ట్రాసోనోగ్రఫీని ఉపయోగించి చికిత్స ద్వారా మొదటి ప్రయత్నంలోనే నూరుశాతం నివారణ ద్వారా రోగికి పూర్తి ఉపశమనం కలిగించేలా వైద్యసేవలు అందిస్తున్నామని ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ, ప్రొఫెసర్ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వ

డాక్టర్ ఉమామహేశ్వరరావు

రావు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమెరికన్ బోర్డ్ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ మార్గదర్శకాల ప్రకారం వెన్నెముకలో స్టెరాయిడ్, అనస్తీటిక్ ఎపిడ్యూరల్ బ్లాకులు, న్యూరోయాక్సియల్ బ్లాకులు, ఫేసెట్ జాయింట్ బ్లాకులు, కండరాల నొప్పిని తగ్గించడం మామూలు స్థితికి చేరుకునేలా రోగులకు విజయవంతంగా చికిత్స చేస్తామన్నారు. అన్ని కీళ్ల నొప్పులకు అనుభవజ్ఞులైన డాక్టర్ గౌరీభవన్ పోథిని పర్యవేక్షణలో ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ మెడిసిన్, ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ జనరల్ ప్రాక్టీస్‌లో బాగా శిక్షణ పొందిన వైద్యుల ద్వారా చికిత్సలను అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు తమ ఆసుపత్రి వెబ్‌సైట్ www.lionscancer-hospital.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, అపాయింట్‌మెంట్ కోసం 95604 47813 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు 57వ, జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ తెలిపారు. వారం రోజులపాటు గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు వివిధ పోటీలు, ర్యాలీ నిర్వహణతోపాటు ఆదివారం కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం గ్రంథాలయంలో ఆవిష్కరించారు

గొలుగొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి రాజుబాబు తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, వక్తృత్వ పోటీ, 16న గ్రంథాలయ పితామహులకు నివాళి, చిత్రలేఖన పోటీలు, 17న చదవడం మాకిష్టం, మ్యూజికల్ చైర్, 18న క్విజ్, 19 మహిళా దినోత్సవం, రంగవల్లి పోటీలు, 20న వారోత్సవాలు ముగింపు సభ, బహుమతులు ప్రదానం చేస్తామన్నారు

నక్కపల్లి:స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ఆటలు, పాటలు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు

జోరుగా టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - గాజువాక :జివిఎంసి 73వ వార్డు వంటిళ్ల కూడలిలో క్లస్టర్ ఇన్‌ఛార్జి బలగ బాలునాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు సూచనలతో సాగుతున్న సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర పరిశీలకులు ఎంవిఎస్. చౌదరి, వార్డు అధ్యక్షులు గోలగాని రమణ, సింగూరు అనంత్, పంచదార్ల ఉగ్రం, మొల్లి ప్రకాష్, నంబారు దేవుడు, తాటికొండ శ్రీను, కరణం పెంటారావు, పచ్చికూర అప్పారావు, పోలాకి మహేష్, అజయ్‌కుమార్, వరలక్ష్మి ,పోలవరపు జ్యోతి కూరందాస్ కృష్ణ, పంపన శ్రీను, ఎం రాణి, పాల్గొన్నారు..

'గీతం' దూరవిద్య కోర్సులలో అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికాం డిగ్రీ కోర్సులలో 2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు.యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోగా అందజేయాల న్నారు. పూర్తి వివరాలకు దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు cdl@gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : వివేకానందనగర్ పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు నంద నగర్ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో సొసైటీ సభ్యులు కెఆర్‌కె.మూర్తి, రాంబాబు, ఉదయ్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళీకృష్ణ, పాండురంగారావు, రాఘవ తదితరులు ఉన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మామిడి

ప్రజాశక్తి -మధురవాడ :రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జివిఎంసి ఏడోవార్డు మధురవాడకు చెందిన మామిడి దుర్గారావు నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వార్డు పరిధిలో పార్టీ అభివృద్ధికి తెలుగు యువత అధ్యక్షుడిగా, బూత్ ఇన్‌ఛార్జిగా విశేష కృషిచేసిన దుర్గారావుకు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి దక్కడంపై పలువురు అభినందనలు తెలిపారు. తనను డైరెక్టర్‌గా నియమించిన పార్టీ అధిష్టానానికి దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

మాలతాంబ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : మాలతాంబ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో సాంకేతిక కళాశాల మైదానంలో స్పోర్ట్స్ మీట్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు. రన్నింగ్, క్రికెట్, త్రోబాల్, షాట్ పుట్, ఖోఖో, రిలేరేస్, పిరమిడ్స్, యోగాసనాలు, కరాటే మార్షల్ ఆర్ట్స్, యుద్ధ కళలు, కల్చరల్ ఈవెంట్స్‌గా సాగనున్న వేడుకలో 300మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. మాలతాంబ విద్యాసంస్థల అధినేత ఎన్ఐఎఫ్ఎస్ సిఇఒ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సునీల్ మహంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్జెడి బి .విజయకుమార్, సాంకేతిక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుబాబు, పి.ఎం.పాలెం ఎస్ఐ కె.భాస్కర్ పాల్గొని, క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు.

క్రీడా పోటీల్లో 'వాగ్దేవి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి ఆనందపురం :బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైవేట్ యునైడెడ్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గంభీరం వాగ్దేవి విద్యామందిర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ పోటీల్లో 10 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, క్రికెట్, త్రోబాల్, వాలీబాల్, ఖోఖో, రన్నింగ్ ఐదు కేటగిరీల్లో ఆటల పోటీలు నిర్వహించారు. అన్ని విభాగాల్లో100 పాయింట్లకు గాను 47 పాయింట్లు సాధించి వాగ్దేవి విద్యామందిర్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఎసెంట్ స్కూల్ శంకరరావు, ఎన్‌డి స్కూల్ శ్రీధర్, ఈస్టర్న్ విశాఖ పాఠశాల, ఎస్ఎస్ఎస్‌వి స్కూల్, వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ గణేష్, భారతి స్కూల్ దొంతల రామారావు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ప్రజాపోరులో సిపిఎం నేతలు

మునగపాకలో కార్మికులకు కరపత్రాలు ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

దేశంలోనూ, రాష్ట్రంలోని భారీగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సిపిఎం నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు.

దేవరాపల్లి : నిత్యవసర ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర విమర్శించారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలోని గిరిజనులతో నిరసన కార్యక్రమం చేపట్టారు అనంతరం సిపిఎం మండల కార్యదర్శి బిటి దొర, మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో ఉత్తరాంధ్ర జిల్లాలకు తీవ్రమైన ద్రోహం జరిగిందన్నారు. 14వ తారీఖున జరిగే ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ధర్నాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మొలగుమ్మి ఎరునాయుడు, సోంబాబు, మహిళలు పాల్గొన్నారు.

మునగపాక : సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రం మునగపాకలో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్ళ వద్ద, ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలపై సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా పోరును వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ కౌలు దారులకు కౌలు కార్డులు, రైతు భరోసా వెంటనే ఇవ్వాలని, విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవుపాల ధరలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.

పరవాడ : మండలంలోని పి.బోనంగి గ్రామంలో సిపిఎం నాయకులు పి.మాణిక్యం ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మహిళలు, పిల్లల మీద దాడులు, అత్యాచారాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, వెంకటలక్ష్మి, జి లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజాపోరు క్యాంపియన్ చోడవరం మండలంలోని వెంకన్నపాలెం, దుడ్డుపాలెం నరసయ్యపేట, చోడవరం పట్టణం కోటవీధి శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో 20 వేలు కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపైన వేయడాన్ని సిపిఎం మండల నాయకులు ఎస్వి.నాయుడు తీవ్రంగా ఖండించారు.

కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాలలో సిపిఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. గురువారం మండల కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు గండి నాయన బాబు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్రా దేముడు పాల్గొన్నారు.

కశింకోటలో నిరసన తెలుపుతున్న దృశ్యం

అనకాపల్లి : సిపిఎం పోరుయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం అనకాపల్లి సిపిఎం కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్, రామచంద్ర థియేటర్ ఉడ్ పేట, నర్సింగరావుపేట, తాసిల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి, షాపులకి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు గండి నాయన బాబు, బోప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ళ తేలయ్యబాబు, జి.సుభాషిణి, అల్లు రాజు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, కె.అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

కశింకోట : మండలంలోని తాళ్ళ పాలెం గ్రామ సచివాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ప్రజా పోరు నిరసన కార్యక్రమం బుధవారం జరిగింది. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.సత్తిబాబు, ఎస్. నాగరాజు, బెన్నయ్య, ఎస్.కె రెహమాన్, బి. నూకరాజు, కె. అప్పలనాయుడు, సన్యాసినాయుడు, ఎం. అప్పారావు, ఎం. అప్పల సోమ నాయుడు, ఎన్. అప్పారావు, ఆర్. బలరాం, బి.అప్పారావు, ఎస్.గోవింద పాల్గొన్నారు.

జివిఎంసి 45వ వార్డులో...

అచ్యుతాపురం : నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కుమారపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము, నాయకులు రాజాన సత్తిబాబు, కళ్యాణం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా పోరులో భాగంగా బుధవారం జివిఎంసి 45వ వార్డు ఎఎస్ఆర్ నగర్ సచివాలయం వద్ద పార్టీ అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ప్రజాపోరు వాల్‌పోస్టర్లను సిపిఎం జోన్ నాయకుడు గౌరీష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో స్థానిక నేతలు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈనెల 14న గురువారం తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎంవిపి కాలనీ : పిఠాపురం కాలనీ సచివాలయం వద్ద బుధవారం సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కమిటీ సభ్యులు పెంటకోట వెంకటరావు మాట్లాడుతూ, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పెరిగిన ధరలను అదుపు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు కె.కుమారి, ఎం.చంటి, నాయకులు జివిఎన్.చలపతి, కుమారమంగళం, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలను తగ్గించాలి : సిపిఎం జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బి.గంగారావు

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో పెరిగిన అధిక ధరలను అరికట్టాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేయాలని సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన ప్రజాపోరు పిలుపులో భాగంగా బుధవారం సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన రామ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలపై విపరీతమైన భారాలు వేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీలను పెంచడం, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటం తగదన్నారు. చెత్తపై పన్ను నేటికీ రద్దు చేయలేదన్నారు. గత ప్రభుత్వం పెంచిన ఆస్తి ఆధారిత విలువ పన్నులను మళ్లీ పెంచడానికి సిద్ధపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి, కె.నరసింగరావు, కె.చంద్రశేఖర్, కె.సంతోష్‌కుమార్, దుర్గారావు, టి.నూకరాజు, సతీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో..

పిఠాపురం కాలనీలో...

మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు

మెట్రో కారిడర్‌ను అనకాపల్లి నుండి ప్రారంభించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ మెట్రో కారిడార్‌ను అనకాపల్లి నుండి కొమ్మాది వరకు కొనసాగించాలని అనకాపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. కేవలం అనకాపల్లి మునిసిపాలిటీని 2009లో మెట్రో కారిడర్ కోసమే జీవీఎంసీలో విలీనం చేసినట్లు గుర్తు చేశారు. ఇప్పటికి 15 సంవత్సరాలైనా కార్యరూపం దాల్చలేదన్నారు. అనకాపల్లి భీమునిపట్నం ప్రజలు ఈ విలీనం వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పుడు ఇదే మెట్రో క్యారీడర్ కేవలం స్టీల్ ప్లాంట్ నుండి కొమ్మాదికి మాత్రమే పరిమితం చేయడం అన్యాయమన్నారు. దీనివల్ల అనకాపల్లి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కనీసం లంకెలపాలెం నుండి అయినా ప్రారంభిస్తే ఫార్మాసిటీ, సెజ్ తో పాటు అనకాపల్లి ప్రజలకు కూడా కొంతైనా వెసులుబాటు కల్పించినట్లు అవుతుందని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ కొండ కొప్పాక జిల్లా పరిషత్ పాఠశాలలో చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ - క్రిష్ ఐకాన్ హాస్పిటల్స్, మోషన్ ఐ కేర్ స్కూల్ హెల్త్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌లో వైద్య నిపుణులు శాంతి ప్రియ, ప్రజ్ఞ, ఆకాష్, ఈ.సాయికృష్ణ, జివి.వాణి, వై.కుమారిపాల్గొని 323 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు ఉన్నత వైద్యానికి విశాఖ డెయిరీ నుండి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రైటర్స్ అకాడమీ ఛైర్మన్, లీడర్ దినపత్రిక సంపాదకులు విల్లూరి వెంకటరమణమూర్తి, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యదర్శి శ్యాం ప్రసాద్, చేతుల మీదగా వ్యాసరచన పోటీలో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. పొట్టి శ్రీరాములు స్వచ్ఛంద సంస్థ పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వివిఎస్ సుమమణి, హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా కార్యదర్శి మల్ల సన్యాసినాయుడు, మహిళా విభాగ అధ్యక్షురాలు నీలకంఠ సంతోష్ లక్ష్మి, తాటిపాక లక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కోసూరు మోహన్ రావు, గ్రామ పెద్దలు వానపల్లి బాబురావు, నెట్టం నాగేశ్వరావు, బి మురళీధర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే వ్యక్తిత్వ వికాసం

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రమశిక్షణతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుందని ప్రముఖ వైద్యులు డిడి నాయుడు పేర్కొన్నారు. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో "ది సక్సెస్ మైండ్ సెట్" పర్సనాలిటీ డెవలప్మెంట్ ప్రత్యేక తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఎప్పటి పాఠాలు అప్పుడు సమయపాలన పాటిస్తూ చదువుకోవడం ద్వారా గొప్ప వ్యక్తులుగా మారవచ్చన్నారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ వంటి మహనీయుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా గొప్ప స్ఫూర్తిని పొందవచ్చని తెలియజేశారు. ప్రతిరోజు వ్యాయామం, కళాశాలలో లైబ్రరీని ఉపయోగించుకోవడం, త్వరగా పడుకుని త్వరగా లేవడం వంటి నియమాలను పాటించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ దయా మాధురి, అధ్యాపకులు ఎస్ఆర్ జమీర్, యు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రికవరీ మొబైల్స్ బాధితులకు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసులు 8వ విడతలో రికవరీ చేసిన 30 లక్షల రూపాయల విలువచేసే 200 మొబైల్ ఫోన్లను ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం బాధితులకు అందజేసారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం సుమారు 3,500 ఫిర్యాదులు నమోదు కాగా, మొత్తం 8 విడతల్లో 2,208 మొబైల్ ఫోన్లను (సుమారు విలువ రూ.3 కోట్ల, 7 లక్షల రూపాయలు) ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్: 93469 12007కు హాయ్ అని టైప్ చేయడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్.ఐ.ఆర్ కట్టకుండా, పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేసిన జిల్లా పోలీసులు, మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ మొబైల్ రికవరీలో విశేష కృషిచేసిన సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ కళ్యాణి, ఐటి కోర్ ఎస్సై సురేష్ బాబు, ఐటి కోర్ సిబ్బంది, సి.సి.ఎస్ పోలీసులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

'జమిలి ఎన్నికలతో మేలు'

ప్రజాశక్తి- అనకాపల్లి : ఒక దేశం ఒక ఎలక్షన్ వలన దేశానికి ఆర్థికంగా మేలు చేకూరుతుందని ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థి, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలు నాయుడు అన్నారు. కళాశాలలో బుధవారం ఒక దేశం ఒక ఎలక్షన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. 1952-67ల మధ్య ఒక దేశం ఒక ఎలక్షన్ ప్రకారమే జరిగినట్లు, కానీ మనదేశంలో భిన్న రాష్ట్రాలు భిన్న సాంస్కృతిక పరిస్థితులు ఉండటంతో ఇవి క్రమేణ అమలు కావడం జరగలేదన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎస్. నాయుడు, ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ జె. సామ్రాజ్యం, సూపరింటెండెంట్ పి. అనురాధ, కళాశాల పూర్వ విద్యార్థి సంఘ ప్రెసిడెంట్ బొడ్డేడ అప్పారావు, కొణతాల సత్యనారాయణ మూర్తి, పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా జిల్లా పోలీసులు "సంకల్పం" అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. "బీ స్మార్ట్ - డోన్ట్ స్టార్ట్" అంటూ విద్యార్థులకు డ్రగ్సుకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగదారులు, అమ్మేవారి, సరఫరా చేసేవారి సమాచారం పోలీస్ వాట్సాప్ నెంబర్ 93929 18196కు తెలియజేయాలని కోరారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచి, వారిలో వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపర్చి, ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని, మత్తు పదార్థాల జోలికి పోరాదని సూచించారు. మత్తు పదార్థాలు యువత శరీరం, నాడీ వ్యవస్థపై దుష్ప్రభావాన్ని ఏవిధంగా చూపిస్తుందో పవర్ పాయింట్ ప్రజెంటేషనుతో వివరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడిన నిందితులకు గరిష్ఠంగా 20 సంవత్సరాల వరకు శిక్ష విధిస్తున్నారంటే ఈ తరహా నేరాలు, చట్టాల తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన యువకులు దొంగతనాలకు పాల్పడి నేరస్థులుగా మారుతున్నారని, అలాంటి వారిపై పోలీసు నిఘా ఉంటుందని, వారు ఏ ఉద్యోగంలో చేరినా, విదేశాలకు వెళ్లాలనుకున్నా పోలీసు వెరిఫికేషన్‌లో వారి నేరచరిత బయటపడుతుందని హెచ్చరించారు. సినీ డైరెక్టర్ నక్కిన త్రినాధరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలన్నారు. డైట్ చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ,

విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా తదితరులు

విద్యార్థులను గంజాయి ఉచ్చులోకి లాగేందుకు గంజాయి స్మగ్లర్లు యత్నిస్తున్నారని, వారి జోలికి పోరాదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ ఆర్.వైకుంఠరావు, డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ కృష్ణ చంద్ర, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-పరవాడ : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరవాడ మండలం బర్నికం శివారు బాపడు పాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కోరుప్రోలు గంగాధర్‌ను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోదరులు పంచకర్ల ప్రసాద్ బుధవారం ఘనంగా సత్కరించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగాధర్ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు గంగాధర్‌ను వారి ఆఫీసులో దుస్సాలువతో ఘనంగా సత్కరించారు, కార్యక్రమంలో పంచకర్ల ప్రసాద్, నాగిరెడ్డి, చిన్నారావు, కేఎన్ఆర్ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలో రెవెన్యూ గ్రామసభలు ముగిశాయని, మొత్తం 1851 అర్జీలు వచ్చాయని స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప రైతులకు 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందని చెప్పారు. గతంలో మండలంలో 20 గ్రామాల్లో జరిగిన భూ రీసర్వే అనంతరం ఉత్పన్నమైన పలు సమస్యల పరిష్కారం నిమిత్తం ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను అక్టోబర్ 17 నుండి ప్రారంభించి ఈనెల 12న ముగించడం జరిగిందని చెప్పారు. అత్యధికంగా సుమారు 1000 దరఖాస్తులు భూ విస్తీర్ణం సమస్యలపై రాగా, ఇందులో ఎల్లుప్పి గ్రామం నుండే 123 దరఖాస్తులు రావడం జరిగిందని చెప్పారు. అయితే వీటి పరిష్కారం ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎన్‌ఓపి దృష్టిలో పెట్టుకొని అర్జీలను పరిశీలించి రైతుల సమక్షంలోనే వారి పొలం మీదకు వచ్చి అధికారులు వారి సమక్షంలోనే సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తహశీల్దారు స్పష్టం చేశారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మీడియా కో-ఆర్డినేటర్ కరణం రవికుమార్ మాట్లాడుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుకు స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించడంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరిగిందని తెలిపారు. గత సభ్యత్వాలతో పోల్చుకుంటే దాదాపు రెట్టింపు సభ్యులు పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు నాయకులు శానాపతి తులసీరామ్, సేనాపతి రాజా మహేష్, బండి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి మాడుగుల సమస్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్రంలోనే మాడుగుల నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందని, ఇక్కడ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి కోసం రోడ్లు, పరిశ్రమల ఏర్పాటు, యువత రైతు సమస్యలపై వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన చంద్రబాబు తప్పకుండా మాడుగుల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని మాట ఇచ్చినట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు.

ఘనంగా మాజీ ఎంపిపీ ధనమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ జన్మదిన వేడుకలు బుధవారం మండలంలోని ఏఎస్.పేటలో ఘనంగా నిర్వహించారు. ధనమ్మ, రమణారావు దంపతులకు పూల మాలలు వేసి బర్తడే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొన నాగేశ్వరరావు, మళ్ల గోపి, గుమ్మడి నారాయణరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి-యలమంచిలి : మునిసిపాలిటీ పరిధిలోని సోమలింగపాలెంలో బుధవారం గౌరీపరమేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు పోటెత్తారు. ఉత్సవ కమిటీ భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించింది. స్థానిక శ్రీరాజరాజేశ్వరీదేవి సోమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు పూజల అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమానికి గ్రామస్తులే కాకుండా పరిసర గ్రామస్తులు కూడా పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి విశ్వేశ్వరరావు తెలిపారు. కార్యమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కర్రి స్వామి, పిల్లా విశ్వనాథం, పెంటకోట రామారావు తదితరులు పాల్గొన్నారు

డ్వాక్రా మహిళల సొమ్ము రూ.30 లక్షలు స్వాహా

పోలీసు స్టేషన్ వద్ద డ్వాక్రా సంఘాల సభ్యులు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని సింహాద్రిపురం, సబ్బవరపు వారి కల్లాలు, పాతిక తదితర గ్రామాల్లో డ్వాక్రా మహిళలను మోసగించి బ్యాంక్ అధికారుల సహాయంతో వెలుగు సిబ్బంది రమారమి రూ.30 లక్షల వరకు స్వాహా చేశారు. డ్వాక్రా సిఎ, సీసీ గోవాడ బ్యాంకు అధికారుల సహకారంతో స్వాహా చేశారని పలు డ్వాక్రా సంఘాల సభ్యులు చోడవరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి దోషులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఎంతో పారదర్శకంగా వ్యవహరించే బ్యాంకు అధికారులు మహిళలకు తెలియకుండా డబ్బులు ఎలా డ్రా చేశారని ప్రశ్నించారు. బ్యాంక్ అధికారులపై మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులతో పాటు సంబంధిత అధికారులు విచారణ జరిపించే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు వారం రోజులపాటు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని గ్రంథాలయాధికారి వి.ఆనంద్ తెలిపారు. వారం రోజుల కార్యక్రమాల్లో పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, గ్రంథాలయ ఉద్యమానికి కృషిచేసిన పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య సంస్మరణ, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, క్విజ్, వక్తృత్వ, పాటలు పోటీలు, కవిసమ్మేళనం వంటి కార్యక్రమాలు జరుగుతాయని, ముగింపు సభలో బహుమతులు ప్రదానం ఉందని చెప్పారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో జరుగు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆ గ్రంథాలయ అధికారి పద్మావతి బుధవారం పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని వారికి అందజేశారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని స్థానిక గ్రంథాలయాధికారి ఎల్వి రమణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

గొలుగొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి రాజుబాబు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 20న వారోత్సవాలు ముగింపు సభ, బహుమతులు ప్రధానం చేస్తామని చెప్పారు.

నక్కపల్లి : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు తెలిపారు.

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు జరుగు గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు వివిధ పోటీలు, ర్యాలీ నిర్వహణతోపాటు కవి సమ్మేళనం నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గ్రంథాలయంలో ఆవిష్కరించారు

ఎన్ఎఓబి నిర్మాణ పనులు చేస్తున్న

కార్మికుల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని ఎన్ఎఓబి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎన్ఎఓబి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు జి.దేముడు నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్ఎఓబి నిర్మాణ పనిచేస్తున్న ఐటిడిసి కన్స్ట్రక్షన్ కంపెనీలో వెల్డర్ పని చేసే బీహార్ రాష్ట్రానికి చెందిన బప్పు ఖాన్ (41) అనే కార్మికుడు బుధవారం ఉదయం పనిలో ఉండగానే గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు యాజమాన్యం తెలిపిందని పేర్కొన్నారు. మరో అలాగే కెఈసి నిర్మాణ సంస్థలో పని చేస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ మండల్ (26) రెండు రోజుల క్రితం మృతి చెందగా, శవం దుర్వాసన వచ్చే వరకు యాజమాన్యం చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఎన్ఎఓబి కాంపౌండ్ లోపల ఐటిడిసి, ఎల్ అండ్ టి, కేఈసి వంటి నిర్మాణ సంస్థల్లో అనేక రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు 9200 మంది పని చేస్తున్నారని, వారికి మెరుగైన వసతి లేక, వైద్యం అందక ఇప్పటికే అనేకమంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సెంట్రల్ లేబర్ కమిషనర్, సేఫ్టీ ఇన్స్పెక్టర్, జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని దేవుడునాయుడు డిమాండ్ చేశారు. కార్మికులకు మెరుగైన వసతి కల్పించాలని, వైద్యం, అందించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, వలస కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. లేకుంటే కార్మికులను సమీకరించి ఎన్ఎఓబి మెయిన్ గేటు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ గంగరాజు, సిహెచ్ అప్పలరాజు, కాసియా పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : పరవాడలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎన్‌డిఆర్‌ఎఫ్ వారిచే వివిధ రకాల ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు తమని తాము రక్షించుకోవడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విశాఖపట్టణం 10వ బెటాలియన్ ఎన్డిఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ వై సత్యనారాయణ ఆధ్వర్యంలో టీమ్ సభ్యులు ఒక చక్కటి ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు, మండల విద్యాశాఖ అధికారులు ఎం దివాకరరావు, జి సాయిశైలజ, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్‌లో శ్రీఅభయాంజనేయ స్వామి వారి ఆలయ 11వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజు వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జడ్పిటిసి పైల సన్యాసి రాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, వెన్నెల సన్యాసిరావు, గొర్లివాని పాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, దశి నదియా, గంజి సురేష్, సాలపు సంతోష్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని భవిత కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు బుధవారం సందర్శించారు. భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష వారు అందిస్తున్న కార్యక్రమాల గురించి వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అలవెన్స్ కోసం తల్లిదండ్రులను, భవిత కార్యక్రమాల కోసం వికలాంగులను అడిగి తెలుసుకొన్నారు. ఎంవి పౌండేషన్ సంస్థ కో ఆర్డినేటర్ మల్లేష్ స్నేహితుడు, సిహెచ్ శ్రీనివాసరావు 10 వేల రూపాయలతో వాటర్ డిస్పెన్సర్ వితరణ చేయగా డీఈవో అప్పారావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం భవిత ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల, మండల విద్యాశాఖాధికారి ఎమ్.సాయి శైలజ, ఎంవి పౌండేషన్ సంస్థ కో ఆర్డినేటర్ మల్లేష్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు. టి.కుమారి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పథకాలను రైతులు వినియోగించుకోవాలి

ఉపమాకలో మాట్లాడుతున్న బుజ్జి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మండలంలోని ఉపమాక గ్రామంలో రైతు సేవ కేంద్రం వద్ద బుధవారం మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుజ్జి పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ డబ్బులు పడని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఈ కేవైసీ నమోదు చేశారు. వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, వ్యవసాయ సహాయకులు కంబాల రాజు , వ్యవసాయ సిబ్బంది స్థానిక రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. వరిలో వచ్చే తెగుళ్ల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారుప్రస్తుత వరి పొలాలు ధాన్యం పరిపక్వ దశ నుండి పాల కంకి దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో కంకి నల్లి , కంపు నెల్లి, రెల్ల రాల్చు, గోధుమ మచ్చ, మాని పండు వంటి తెగుళ్ళు నియంత్రించ డానికి ఎకరానికి, ప్రోఫోనోపాస్ ఏ400మి.లీ, ప్రోపకొనకొల్ ఏ200 మీ.లి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, నాయకులు మనబాల తాతారావు, గుద్దటి సత్తిబాబు, సిబ్బంది నాయుడు, రాజ్యలక్ష్మి, కొండలరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: వరికి చివరి దశలోసోకే మాని పండు తెగులుపై మండల వ్యవసాయ అధికారిని సరోజినీ అవగాహన కల్పించారు. లింగాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ, ఈ తెగులుతో దిగుబడి తగ్గి పోవడంతో పాటు గింజల నాణ్యతను తగ్గుతుందని తెలిపారు.

గొలుగొండ:మండలంలోని గుండుపాల, వడపర్తి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి సుధారాణి ఆద్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఆయా గ్రామాల్లోని వరి పొలాలను సందర్శించి చీడపీడలు వ్యాపించినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ మందులు వాడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

పద్మనాభం.: పంట మార్పిడితో అధిక దిగుబడులు, మంచి లాభాలు సాధించవచ్చని ఎఒ ఎంవి.చలం అన్నారు. బుధవారం పద్మనాభం, పెంట గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులకు సేంద్రీయ వ్యవసాయ విధానం మంచిదని, రబీలో చిరుధాన్యాలు సాగుచేయాలని సూచించారు. భీమిలి మార్కెట్ కమిటీ సూపర్వైజర్ మేరీకుమారి, ఎంపిఇఒ జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మండలంలోని తాళ్ళవలస, తాటితూ రు గ్రామాల్లో బుధవారం ఎఒ బి.శివకోమలి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల వివరాలను తెలియజేశారు. సూక్ష్మసేద్యం ప్రాజెక్ట్ డైరెక్టర్ మన్మదరావు మాట్లాడుతూ, తుంపరి సేద్యం పథకానికి 50 శాతం, బిందు సేద్యం పథకానికి 90 శాతం రాయితీపై పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది స్వాతి, కృపా మణి, హరీష్, రమేష్ పాల్గొన్నారు

ఫోటో: పురుషోత్తపురం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సూచనలిస్తున్న వ్యవసాయాధికార్లు

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి : మండలంలోని పురుషోత్తపురం, లక్కవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పోలిమేర మోహనరావు అభ్యుదయ రైతులతో మాట్లాడుతూ వరి పంటలు కోత అనంతరం మినుములు, పెసలు, చోడి పంటలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రీనా, రైతులు పోలిశెట్టి వెంకటరమణ, నారాయణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో సర్పంచ్‌లు కొండలరావు, వెంకటారావు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి, విశాఖపట్నం నుండి వచ్చిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీధర్ వరి పంటలో వచ్చే తెగుళ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై కాంతమ్మ, శాస్త్రవేత్త పి.బాబు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కశింకోట వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న, టిడిపి కూటమి నాయకులు ఉల్లింగల రమేష్, కర్రి వెంకట సత్య నారాయణ, కర్రి గోవింద, పశు వైద్యులు డయానా, రైతు సేవా కేంద్రం సహాయకులు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వేషధారణలో చిన్నారులు

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :బాలల దినోత్సవం సందర్భంగా గత 15 రోజులుగా పట్టణంలో పిఆర్టియు ఆధ్వర్యంలో స్థానిక సిటీ క్లబ్ ఆవరణలో జరుగుతున్న బాలల దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం విద్యార్థులు విచిత్ర వేషధారణలతో అలరించారు. దుర్గాదేవి, జలకన్య, హలం పట్టిన రైతు, దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు వేషానికి తగిన విధంగా సంభాషించారు. చిన్నారుల చిలక పలుకులు విని తల్లిదండ్రులతో పాటు కార్యక్రమానికి వచ్చిన పలువురు ముద్దులయ్యారు.వేషధారణ పోటీలకు ప్రభుత్వ పాఠశాలల నుండి భారీ ఎత్తున చిన్నారులు ప్రత్యేక వాహనాలపై వచ్చారు.

విరాళం అందిస్తున్న నారాయణరావు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ స్థానిక శివపురానికి చెందిన సమోసాలు అమ్ముకొని జీవించే గొల్లపూడి పెద్దన్న శెట్టి కుటుంబాన్ని ఎన్నారై అసోసియేషన్ ఆర్థికంగా ఆదుకుంది. పెద్దన్న శెట్టి భార్య క్యాన్సర్‌తో చాలా రోజుల నుండి బాధపడుతుంది. ఆమెకు వైద్యం అందించినప్పటికీ ఇటీవల చనిపోయారు. భార్య ఆరోగ్య పరిస్థితికి ఆయన చాలావరకు ఆర్థికంగా ఖర్చు చేయడంతో ఇబ్బందులు పడుతున్న బాధలను చూసి ఎన్నారై అసోసియేషన్ 500 డాలర్లు (40 వేలు) ఆర్థిక సహకారం అందించారు. వీరి ఆర్థిక పరిస్థితి ఎన్నారై వాసవి అసోసియేషన్ కు తెలిసి ఆర్థికంగా ఆదుకున్నట్లు వ్యాపారవేత్త ఎలాగా నారాయణరావు తెలియజేశారు. నారాయణరావు ఆ నగదును పెద్దన్న శెట్టి కుటుంబానికి బుధవారం అందజేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10వేలు విరాళం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక పెద్ద చెరువు వద్ద కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణా నిత్య అన్నదాన ట్రస్ట్‌కు ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు జన్మదినం సందర్భంగా కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ నిత్య అన్నదాన ట్రస్ట్ కు పది వేల నగదును ట్రస్ట్ సభ్యులకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి -కొత్తకోట:ఏకా దశమిని పురస్కరించు కొని రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో బుధ వారం శ్రీవారి సేవకులు, భజన మండలి సభ్యులు ఆధ్వర్యంలో వేర్వేరుగా భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో హైస్కూల్ సమీపంలో, శ్రీ పద్మావతి భజన మండలి సభ్యులు ఆధ్వర్యంలో శివాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, దేశం పార్టీ నియోజకవర్గం అధ్యక్షురాలు కోట నీలవేణి, గోవిందరావు, ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంపై బుధవారం ఆశా కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ డాక్టర్ వి.శ్రీదేవి సాధారణ వ్యాధుల నివారణకు ఆయుష్‌తో ఉపయోగాలు, సుగర్ తదితర వ్యాధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ ధనలక్ష్మి, ఎంపిహెచ్ఈఓ యడ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

గొలుగొండలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ:గ్రామ పంచాయతీల ప్రణాళిక బద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని గొలుగొండ ఎంపిడిఒ మేరీరోజ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక సమస్యలపై సామాజిక న్యాయం, సంక్షేమాలను దృష్టిలో ఉంచుకొని అన్ని మార్గాలను అభివృద్ధి చేసేలా కార్యాచరణ ప్రణాళికలు ముందస్తుగా తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధి, బడ్జెట్ రూపకల్పనలు సక్రమ వినియోగం పై గ్రామ అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటవురట్ల: గ్రామాల అభివృద్ధికి సహజ వనరులను సద్వినియోగించుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రణాళిక సందర్భంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథం అన్నారు బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులు, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, ఏఓ చంద్రశేఖర్ పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాలలో పేదరికం నిర్మూలించేందుకే ప్రభుత్వం పని చేస్తుందని ఆ దిశగా మహిళలు అడుగులు వేయాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు, బుధవారం మాకవరపాలెం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులు, వెలుగు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ప్రధానంగా వెలుగు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని అందుకు అనుకూలంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు సబ్సిడీ రుణాలు అర్హులందరికీ అదే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు, అదేవిధంగా పంచాయతీ లలో ఎటువంటి అపారిశుద్ధ్యం చోటు చేసుకోకుండా పరిశుభ్రమైన వాతావరణంతో పాటు తాగునీటిని అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో వనరులను సద్వినియోగపరుచుకుని ఆదాయ మార్గాలు కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వరలక్ష్మి, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఎంపిటిసిలు, సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి ధర్మారావు, జడ్పిటిసి పిఎస్ రాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

చోడవరం : గ్రామాలు అభివృద్ధిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజనేయులు, ఎంపిపి గాడి కాసు, ఈఒపిఆర్‌డి మహేష్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో శిక్షణకు హాజరైన అధికారులు, నేతలు

బుచ్చయ్యపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ ప్లానింగ్‌పై శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో ఎంపిపి దాకారపు నాగేశ్వరిదేవి, జడ్పిటిసి సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డి విజయలక్ష్మి, ఏవో శ్రీనివాసరావు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భీమునిపట్నం : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ,అమలుపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులను ఎంపిడిఒ ఎన్.హనుమంతరావుతో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి వెంకట ప్పడు మాట్లాడుతూ, పంచాయితీల్లో అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, విఒఎలు శిక్షణలో పాల్గొన్నారు. ఎంఇఒ ఎం.శివరాణి, సిడిపిఒ శ్రీదేవి, హౌసింగ్ ఎఇ హుస్సేన్ పాల్గొన్నారు.

అధికారుల సమన్వయతోనే గ్రామాభివృద్ధి

ఆనందపురం: వివిధ శాఖల అధికారులు, నేతల సమన్వయంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఒ డాక్టర్ వి జానకి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపిడిఒ జానకి, గ్రామ కార్యదర్శులు. ధనుంజయ, శ్రీరామమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి మాస్టర్ ట్రైనర్స్‌గా గ్రామ పంచాయతీలో నిధులు సమీకరణ, ప్రణాళికా బద్ధంగా వాటిని గ్రామాభివృద్ధికి వినియోగించడంపై శిక్షణనిచ్చారు.

గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

- కాగడాలతో గిరిజనుల ఆందోళన

కాగడాలతో నిరసన చేపడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -కొత్తకోట:గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి పలువురు ఆదివాసీ గిరిజనులు జీలుగులోవ నుంచి పశువుల బంధ వరకు కాగడాలతో ఖాళీ నడకన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు మాట్లాడుతూ, రావికమతం మండలం చీమల పాడు పంచాయతీ శివారు సోంపురం, జీలుగులోవ, పశువులబంద గ్రామాలలో ఆదివాసి గిరిజనులు 20 కుటుంబాలు సోమలమ్మ కొండపై జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ గ్రామా లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటి పడితే అడవి జంతువులు మధ్య బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పీఎం జన్మన్ పథకంలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని సంబంధిత అధికారులు గ్రామం వచ్చి స్వయానా పరిశీలన చేసి ఎస్టిమేషన్ వేసారని నేటికీ విద్యుత్ సౌకర్యం నేటికీ కల్పించ లేదన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించమని పలు మార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఈనెల 27 న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాగడాలతో. డోలి కట్టుకొని వినూత్నంగా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి వి టీ జి సంఘం నాయకులు కొర్ర మహేష్, సీదరి కామేశ్వరరావు, గేమిల శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఒ శిరీషా రాణి

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

ప్రజాశక్తి- నక్కపల్లి:గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిరీషా రాణి పాల్గొని మాట్లాడారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల విధులు, బాధ్యతలు గురించి వివరించారు. ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన పనులను పూర్తి చేయాలన్నారు. అన్ని పంచాయతీ గ్రామాల్లోని ప్రజలకు కనీస అవసరాలైన త్రాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఎస్ ఎస్ ఎస్ మూర్తి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఇన్చార్జ ఈఓపిఆర్‌డి శ్రీను, రిసోర్స్ పర్సన్ మూర్తి పాల్గొన్నారు.

తెప్పోత్సవం

ఉపమాకలో వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం బంధుర సరస్సు వద్ద స్వామివారి తెప్పోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనంపైన, సీతా రాముల వారి ఉత్సవమూర్తులను, శయన పెరుమాళ్ వారిని ఆంజనేయ వాహనం పైన అధిష్టింపజేసి స్వామివారి పుష్కరిణి (బంధుర సరస్సు) లంక వారి మండపం వద్ద ప్రత్యేక పూజలు, పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న లక్ష్మిశ్రీ

నార్సింగి మార్కెట్ డైరెక్టర్‌గా లక్ష్మి శ్రీ నియామకం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక ధనిమిరెడ్డి వీధికి చెందిన లక్ష్మీ శ్రీ తెలంగాణ గండిపేట మండలంలో కీలకమైన నార్సింగి మార్కెట్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. నర్సీపట్నంకు చెందిన ఆమె సినీ రంగంలో ప్రవేశించడంతో ఎప్పటినుండో తెలంగాణలో స్థిరపడ్డారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.మార్కెట్ డైరెక్టర్ గా నియమితులైన ఆమెకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

నీటి సంఘాల ఎన్నికలకు గట్టి పోటీ

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 23న నిర్వహించే నీటి సంఘం ఎన్నికలకు అధికారులు సిద్ధం చేయడంతో ఆయకట్టు రైతులు చైర్మన్ పదవికి పావులు కదుపుతున్నారు. మండలంలో 10 నీటి సంఘాలకు ఎన్నికలు జరపనుండగా కొమరవోలు ఆవకు, జె.నాయుడుపాలెందొర చెరువుకు, కుసర్లపూడి కైసర్లవాని చెరువుకు పోటీకి రంగం సిద్ధం చేస్తున్నారు. జె.నాయుడుపాలెం దొరచెరువుకు టీడీపీ నుండే ఆశావాహులు ఎక్కువగా తయారవడంతో స్థానిక నాయకులు తలలు పట్టుకొనే పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలో మాజీ నీటి సంఘం అధ్యక్షులు మరిశా వెంకటరమణ, మరిశా శ్రీను, మల్ల శ్రీను, చినిన్న శ్రీనులు పోటీకి వారి వారి అనుయాయులతో పావులు కదుపుతున్నారు. కుసర్లపూడి కైసర్లవాని చెరువుకు ఒకే పార్టీ నుండి ఇద్దరు పోటీకి సన్నాహాలు చేస్తున్నారు. కొమరవోలు ఆవకు 7వేల మంది ఓటర్లు ఉన్నారు. రోలుగుంట మండలం కొమరవోలు, పడాలపాలెం, లగుడు కొత్తూరు, జె.నాయుడుపాలెం, జగ్గంపేట, రావికమతం మడలం కన్నంపేట మాకవరపాలెం మండలం తూటిపాల, తాడపాల గ్రామాల్లో ఓటర్లు ఉండటంతో వారిలోను ఆశావాహులు తక్కువ అవడంతో పోటీ పడుతున్నారు. మిగతా ఏడు ఏడు సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరగవచ్చని ఆయా గ్రామాల వారు అంటున్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి-కోటవరట్ల:ఈనెల 23న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలపై బుధవారం తహసిల్దారు తిరుమలబాబు, జల వనరుల శాఖ ఇంజనీరు రాజేష్ అవగాహన కల్పించారు. మేజర్ కాలవలు దుర్గాడ, తాండవ సహా మైనర్ కాలవలకు ఎన్నికలు నిర్వహించే రోజే నామినేషన్ తీసుకోవడం, వాటిని పరిశీలించడం, అనంతరం ఎన్నికలు ఒకేరోజు జరుగుతాయని సందర్భంగా తెలిపారు. ఫైనల్ జాబితాను ఈనెల 15న విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, వ్యవసాయ శాఖ అధికారిని సరోజిని, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

ఆటలాడుతున్న విద్యార్థులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు బుధవారం ఆటలు పోటీలను నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె నాగమణి, ఎం లోవ కృష్ణ పర్యవేక్షణలో వివిధ రకాల ఆటల పోటీల్లో దివ్యాంగ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ మాట్లాడుతూ, ఈనెల 14న బాలల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.

నేటి నుంచి తాజ్ గేట్‌వే మూసివేత

మాట్లాడుతున్న వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభుకిశోర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలో గత 38 సంవత్సరాలుగా ప్రజలకు విశేష సేవలందించిన తాజ్ గేట్ వే హోటల్ పునర్నిర్మాణం కోసం గురువారం నుంచి మూసివేస్తున్నట్లు వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ తెలిపారు. బుధవారం సాయంత్రం తాజ్ గేటు వే హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1988లో సి పెరల్‌గా ప్రారంభమైన ఈ హోటల్ 1992 నుంచి తాజ్ రెసిడెన్సీగా ఓరియంటల్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యాన సేవలందించిందని తెలిపారు. అనంతరం 2018లో వరుణ్ హాస్పిటలిటి ప్రయివేట్ లిమిటెడ్ ఆ సంస్థ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ప్రపంచ స్థాయి హోటల్‌ను అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో దీన్ని కూల్చివేసి ఆ స్థానంలో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో మూడు భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఒకటి 23 అంతస్తుల ఫైవ్ స్టార్ డీలక్స్ హోటల్ కాగా మరొకటి 2.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్, మరో భవనంగా 15 అంతస్తుల సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌ను నిర్మిస్తున్నామని వివరించారు. దీనిని 2028 చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ హోటల్లో 374 సి ఫేసింగ్ రూములు, 1000 కార్ల పార్కింగ్ సదుపాయం ఉంటుందని, రకరకాల రుచులు అందించే హోటళ్లు, పెద్ద కన్వెన్షన్ సెంటర్, పైన హెలిపాడ్, స్విమ్మింగ్ పూల్ ఉంటుందని వివరించారు.

గ్రేడ్ -1 ఆఫీస్ స్పేస్‌లో భాగంగా నిర్మించే 16 అంతస్తుల భవనంలో మొదటి రెండు అంతస్తులు రిటైల్ షాపింగ్‌కు, మిగిలిన 14 అంతస్తులను గ్రేడ్ -1 ఆఫీస్ స్పేస్ ఉపయోగించనున్నామని తెలిపారు. 15 అంతస్థుల సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను ప్రజలకు అమ్మేస్తామని చెప్పారు. ఈ భవనం పూర్తయితే 5,000 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో వరుణ్ గ్రూప్ ఎమ్‌డి వరుణ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వర్ష, ఆర్కిటెక్ ఎ.కటారి పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

రీ సర్వే రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాత కృష్ణదేవిపేటలో బుధవారం రీ సర్వే రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసరావు రీ సర్వే అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ గ్రామసభలో 30 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రతి విద్యార్థికీ అపార్ తప్పనిసరి :డిఇఒ

ప్రజాశక్తి- గాజువాక :ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి అని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం గాజువాక ఎన్ఎఫ్ఎస్ పాఠశాలలో గాజువాక, పెదగంట్యాడ, ములగాడ మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)ను వెంటనే పాఠశాలల లాగిన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏ స్కూల్ లాగిన్‌లోనైనా డ్రాప్‌బాక్స్‌లో ఒక్క విద్యార్థి కూడా ఉండడానికి వీలులేదని, వెంటనే తొలగించాలని కోరారు. అదే సమయంలో పాఠశాలలో చదవని విద్యార్థుల వివరాలు పాఠశాల లాగిన్‌లో ఉండరాదని హెచ్చరించారు. ఫార్మాటివ్ 1,2 పరీక్షల మార్కులు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ాార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రవీంధ్రబాబు, ఎంఇఒలు సునీత, విశ్వనాధం, శ్రీనివాస్,రమణాజీ, వెంకటరావు, త్రినాధరావు, సిఆర్‌పిలు, జిప్సా సభ్యులు భాస్కరరావు, శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబూరావు పాల్గొన్నారు.

పుస్తక రచయితకు అభినందన

విద్యార్థులకు ఉపయోగపడే రచనలు ఎంతో అవసరమని డిఇఒ ప్రేమ్‌కుమార్ అన్నారు. ప్రయివేటుపాఠశాలల యాజమాన్యాల సమావేశంలో అలజింగి ఉదయకుమార్ రచించిన 'టాపర్స్ అండ్ ర్యాంకర్స్' పుస్తకంపై మాట్లాడుతూ, విద్యాబోధనలోనూ, వ్యక్తిత్వ వికాస శిక్షణలో తనకున్న అనుభవాన్ని పుస్తక రూపంలో అందరికీ అందించడం ప్రశంసనీయమని రచయిత ఉదయకుమార్‌ను అభినందించారు. పుస్తక రచయిత అలజంగి ఉదయకుమార్ మాట్లాడుతూ, జిల్లా టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణత సాధనకు తన వంతు సహకారం అందిస్తానన్నారు.

ఉదయకుమార్‌ను అభినందిస్తున్న డిఇఒ

భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ప్రత్యేక అనుబంధం

విశాఖపట్నం గురువారం 14-11-2024 8 పేజీలు

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

నెహ్రూ విధానాల విశిష్టత

మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుంచీ, నెహ్రూ విధానాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ దేశం వెనుకబడిపోడానికి ఆ విధానాలే కారణం అంటూ ప్రచారం చేస్తోంది. చివరికి చరిత్ర పుస్తకాల్లో సైతం నెహ్రూ ప్రస్తావన లేకుండా తుడిచేయడానికి పూనుకుంది. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను పూర్తిగా తిరగదోడినప్పుడే ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ ఆదేశిత దివాళాకోరు ఆర్థిక విధానాలను సమర్థించుకోవడం తేలికౌతుంది. అందుకే సంఘపరివార్‌కు నెహ్రూ అంటే ప్రత్యేకమైన ద్వేషం, అక్కసు.

- ఎంవిఎస్.శర్మ

ఇంతకూ నెహ్రూ ప్రభుత్వం అనుసరించిన విధానాలేమిటి ? వాటి విశిష్టత ఏమిటి ? నేటి పరిస్థితుల్లో వాటి ప్రాధాన్యత ఏమిటి ? అన్నది తెలుసుకోవడం చాలా అవసరం. నెహ్రూ జయంతి అంటే కేవలం చిన్న పిల్లల పండగ మాత్రమే కాదు. నెహ్రూ అనుసరించిన విధానాలు ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, స్వావలంబన, సామాజిక న్యాయం వంటి మన రాజ్యాంగ మౌలిక విలువలను ఏవిధంగా పటిష్టం చేశాయో మననం చేసుకోవడం చాలా అవసరం. ఇక్కడ ప్రత్యేకించి నెహ్రూ ఆర్థిక విధానాల విశిష్టతను చర్చిద్దాం.

1949లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు రాసిన ఒక లేఖలో నెహ్రూ 'మనం రాజకీయంగా స్వతంత్ర దేశంగా ఉండడం మాత్రమే చాలదు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించేవరకూ మన స్వాతంత్ర్య పోరాటం కొనసాగాల్సిందే'నని పేర్కొన్నారు. మనకు స్వాతంత్ర్యం వచ్చేనాటికి పారిశ్రామిక ఉత్పత్తుల కోసం పూర్తిగా విదేశాల దయా దాక్షిణ్యాలపైనే ఆధారపడవలసివచ్చింది. యంత్రాలు, వాటి విడి భాగాలు కావాలంటే దాదాపు 90 శాతం దిగుమతులద్వారా తెచ్చుకోవలసిందే. ఈ పరాధీనత నుండి బయటపడి స్వావలంబన దిశగా దేశాన్ని నడిపించడానికి

నెహ్రూ - మహలోబినస్ రూపొందించిన వ్యూహం పంచవర్ష ప్రణాళికల రూపం తీసుకుంది. 1914 వరకూ సాగిన దేశీయ పరిశ్రమల విధ్వంసం, ఆ తర్వాత 1947 వరకూ నత్తనడకన

సాగిన పారిశ్రామికీకరణ దేశాన్ని బలహీనపరిచాయి. దానినుండి బయటపడి 1951 నుంచి 1969 మధ్య పారిశ్రామిక ఉత్పత్తి మూడు వందల శాతం పెరుగుదలను నమోదు చేసింది. వినిమయ సరుకుల ఉత్పత్తిలో 70 శాతం, పారిశ్రామిక పరికరాల, యంత్రాల ఉత్పత్తిలో 1000 శాతం పెరుగుదల నమోదైంది. దాదాపు 90 శాతం పారిశ్రామిక ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దుస్థితి నుండి బయట పడి 1974 నాటికి కేవలం 9 శాతం మాత్రమే దిగుమతి చేసుకునే దశకు బలపడ్డాం. దేశం స్వావలంబన సాధించగలిగిందంటే ఈ విధానాలే కారణం.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో ప్రైవేటు రంగం

మిగతా 3లో...

ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనకు కృషి

సోషలిస్టు, సెక్యులర్ తొలి భారత ప్రధాని నెహ్రూ

నవంబర్ 14.. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి. ఆ రోజునే జాతీయ బాలల దినోత్సవంగా ప్రకటించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో జాతిపిత మహాత్మాగాంధీ తర్వాత అత్యధిక ప్రజాదరణ కలిగిన నెహ్రూ లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ దృక్పథంకై గట్టిగా నిలబడిన నాయకుడు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్, మోడీ ఆ దృక్పథాలపైనే దాడి జరుపుతున్న సందర్భంగా వాటిని కాపాడుకోవాలి.

స్వాతంత్ర్యం నాటికి భారతదేశంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా లేదు. మన దేశం నుంచి ముడిసరుకులు విదేశాలకు ఎగుమతి చేసేవారు. విదేశాల నుండి సరుకులను తెచ్చి భారతదేశంలో నాటి బ్రిటీష్ వారు అమ్మేవారు. భారతదేశంలో పరిశ్రమలను అభివృద్ధి కాకుండా బ్రిటీష్ సామ్రాజ్య వాదులు అడ్డుకున్నారు. ఏ దేశమైనా అభివృద్ధి కావాలంటే పారిశ్రామికీకరణ అనివార్యం. అందుకే స్వాతంత్ర్యానంతరం స్వయం సమృద్ధి సాధించడానికి భారత ప్రధాని జవహర్‌లాల్ మిగతా 2లో...



- సిహెచ్.నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండవ పెద్ద నగరంగా విశాఖ ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాత్రంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ళ కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2లక్షల 15వేలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13లక్షల 57వేలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు మిగతా 2లో...

- ఎ.అజశర్మ, ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక.

సోషలిస్టు, సెక్యులర్ తొలి భారత ప్రధాని నెహ్రూ

(మొదటి పేజీ తరువాయి..) నెహ్రూ నడుం బిగించారు. స్వాతంత్ర్యానికి ముందు గుండు సూదితో సహా విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ప్రాణావసరమైన కనీస పెన్సిలిన్ మందు కూడా మన దేశంలో నాడు లభ్యం కాలేదు. సోషలిస్టు దేశాలు ముఖ్యంగా రష్యా సహాయంతో మన దేశంలో పారిశ్రామికీకరణ అభివృద్ధి జరిగింది. మందుల పరిశ్రమలకు సంబంధించిన డిజైన్ ఇవ్వాలని అమెరికా నాటి అధ్యక్షుడు కెనడీని నెహ్రూ అనేక సార్లు బ్రతిమాలారు. కానీ కెనడీ అంగీకరించలేదు. రష్యా సహాయంతో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ కంపెనీ లిమిటెడ్ (ఐడిపిఎల్) ఏర్పడింది. బిలాయ్, బొకారోలలో స్టీల్ ప్లాంట్లును రష్యా నిర్మించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్‌ను కూడా రష్యాయే కట్టింది. దాదాపు వంద పరిశ్రమలకుపైగా ప్రభుత్వ రంగంలో నిర్మించడానికి అన్ని సోషలిస్టు దేశాలు భారతదేశానికి తోడ్పడ్డాయి. అందువల్లనే 1970వ దశకం నాటికి భారతదేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించింది. 'ఇస్రో' సంస్థ ద్వారా అంతరిక్షంలోకి ఒకేసారి 103 రాకెట్స్ పంపగలుగుతున్నాం. స్వాతంత్ర్యానికి ముందు ప్రారంభించిన విశాఖ షిప్ యార్డు వాల్‌చంద్, హీరాచంద్‌కు చెందిన కంపెనీ. కానీ వీరు షిప్‌లు నిర్మించలేక ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోమని నెహ్రూకు లేఖ రాశారు. నెహ్రూ విశాఖ వచ్చి స్వయంగా హిందూస్థాన్ షిప్‌యార్డును కేంద్ర ప్రభుత్వ రంగంలోకి స్వాధీనం చేసుకున్నారు.

విశాఖలో జల ఉష ప్రారంభ వేడుకలో నెహ్రూ (ఫైల్ ఫొటో)

దేశంలోని అగ్రగామి షిప్‌యార్డుగా నేడు అభివృద్ధి చెందింది.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు 250పైగా నేటికీ రాణిస్తున్నాయి. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాయి. నష్టాల్లోని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలన్నీ జాతీయం చేయబడ్డాయి. ప్రభుత్వ రంగంలోని ఎల్‌ఐసి సంస్థను కేవలం రూ.5 కోట్లతో స్థాపించగా ఈనాడు దాని విలువ రూ.62 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రంగం ద్వారా దేశ సంపద అభివృద్ధి చెందింది. విదేశాల నుండి సరుకులు కొనకుండా విదేశీ మారకద్రవ్యం మిగిలింది. ప్రభుత్వ ఆదాయంలో లక్షల కోట్లు ప్రతి సంవత్సరం పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర బడ్జెట్‌కు సమకూరుతున్నాయి. భారీ పరిశ్రమలు దేశమంతటా విస్తరించడం వల్ల వెనకబడ్డ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ఒక భారీ పరిశ్రమకు అనుబంధంగా అనేక వందల చిన్న పరిశ్రమలు వచ్చాయి. ఈ పరిశ్రమలన్నింటిలో ఉపాధి లక్షల సంఖ్యలో పెరిగింది. ప్రైవేట్ పరిశ్రమల కంటే ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో జీతాలు, సౌకర్యాలు మెండు. లాభాల కోసమే పరిశ్రమలు పెట్టే ప్రైవేట్ యాజమాన్యాల కంటే ప్రభుత్వ రంగం అనేక రెట్లు మిన్న. నెహ్రూ స్థాపించిన ప్రభుత్వం రంగ అనుకూల విధానాలకు నేడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాలు తీవ్రంగా తూట్లు పొడుస్తున్నాయి. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు సమాజానికి హానికరం. కేంద్ర ప్రభుత్వ రంగాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ప్రజలు, కార్మికవర్గంపై ఉంది.

విశాఖ రైల్వే స్టేషన్

ప్రజా సేవలో రైల్వే

టి.చిట్టిబాబు,
పూర్వ అధ్యక్షులు,
హెడ్ క్వార్టర్స్ 1 బ్రాంచ్,
ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, విశాఖపట్నం.

ప్రజల సౌకర్యార్థం ప్రజా రవాణాను సరసమైన ఛార్జీలతో నడపడం ప్రభుత్వ బాధ్యత. దీనిలో కీలకమైనది రైల్వే. అందుకే నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గం తీసుకున్న విధానపరమైన నిర్ణయాల్లో వ్యూహాత్మక రంగాలలో కీలకమైన వాటిలో రైల్వే అతిముఖ్యమైనది. దీన్ని ప్రభుత్వమే నడుపుతూ వస్తోంది.

బ్రిటిష్ పాలనలో వారి ఆర్థిక ప్రయోజనాలు, సైనిక అవసరాలు కోసం 1845లో రైల్వే ప్రారంభమైంది. 1853 ఏప్రిల్ 16న 34 కిలోమీటర్ల ట్రాక్‌పై ఒక్క ప్యాసింజర్ రైలుతో ప్రారంభమైన రైల్వే క్రమంగా అభివృద్ధి చెందుతూ నేడు సొంతంగా లోకోలు, కోచ్‌లు, ఇతర సామగ్రి తయారీలకు 6 ప్రొడక్షన్ యూనిట్లుకు చేరింది. 1,32,310 కిలోమీటర్ల ట్రాక్, 7335 స్టేషన్లు, 14781 లోకోలు, 84,863 ప్రయాణికుల కోచ్‌లు, 3,18,196 వ్యాగన్లు, రోజూ 13,523 ప్రయాణికుల రైళ్లు, 9146 గూడ్స్ రైళ్లు, రోజూ రెండు కోట్ల మంది ప్యాసింజర్లను రవాణా చేస్తూ ప్రపంచంలో నాలుగో అతి పెద్ద రైల్వే వ్యవస్థగా నిలిచింది. ఎక్కువ మంది ఉద్యోగులగల సంస్థలో ఎనిమిదో స్థానంలో వుంది.

అయితే, బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా రైల్వేలో అనేక డిపార్టుమెంటుల్లో చాపకింద నీరులా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ జోరుగా సాగుతున్నాయి. తమకిచ్చిన లక్ష్యాలను దాటి రికార్డు స్థాయిలో మార్కెట్ ధరల కంటే తక్కువకే ఎల్‌హెచ్‌బి కోచ్‌లను, వందే భారత్ రైళ్లను ఉత్పత్తి చేస్తున్న పెరంబూర్ రైలు కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలా కోచ్ ఫ్యాక్టరీ, ఎలక్ట్రికల్ లోకో ఇంజిన్లు తయారు చేస్తున్న సిఎల్‌డబ్ల్యు మొదలైన వాటి ఉత్పత్తి తగ్గించి విదేశీ సంస్థల నుండి కొనుక్కోవడం, అవుట్ సోర్సింగ్‌ను ముందుకు తెచ్చి శాశ్వత సిబ్బందిని కుదించడం జరుగుతోంది. 150 ప్యాసింజర్ రైళ్లను, 400 స్టేషన్లను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలని మోడీ సర్కారు నిర్ణయించి మరోవైపు స్టేషన్ల ఆధునికీకరణకు విపరీతంగా ఖర్చు చేస్తున్నారంటే ఎవరికోసమో అర్థం చేసుకోవొచ్చు. ఇదిలా ఉండగా రైల్వేలో గత జులై నాటికే 3,62,200 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్‌లో ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వమే తెలిపింది. అంటే ఉన్న ఉద్యోగులపై పని భారం తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవొచ్చు.

1893 సంవత్సరంలో మూడు గూడ్స్ ట్రైన్స్, 200 మంది సిబ్బందితో ప్రారంభమైన ప్రారంభమైన వాల్తేరు డివిజన్ విశాఖ పోర్టు, హెచ్‌పిసిఎల్, బిహెచ్‌ఇఎల్, హెచ్‌ఎస్‌ఎల్, ఎన్‌టిపిసి, గంగవరం పోర్టు, విశాఖ పోర్టు వంటి సంస్థలకు అన్ని విధాలా తోడ్పడుతూ వచ్చింది. దీంతో 1985 నాటికే 21200 మందికి ఉద్యోగులు పెరిగారు. సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలు తరువాత సిబ్బందిని 16,200కు తగ్గించేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గడంతో గూడ్స్ రైళ్ల రాకపోకలు తగ్గాయి.

ఇంకా తగ్గితే రైల్వే స్టీల్ యార్డులో వున్న రైల్వే సిబ్బందిని తగ్గిస్తారు. ప్రభుత్వ రంగ సంస్థల మనుగడతో ఈ డివిజన్ పురోగతీ ఆధారపడి ఉందన్నది దీన్ని బట్టే అర్థమవుతోంది. ప్రస్తుతం రాష్ట్ర విభజన హామీల అమలులో భాగంగా విశాఖలో వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని రైల్వే యూనియన్లు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ రంగ పరిరక్షణను కాంక్షిస్తున్నారు. ఆ దిశగా పోరాటాలకు సమాయత్తమవుతున్నారు.

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి..) 25 లక్షలుగా ఉంది.

ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాలకై సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి. ఇలా పారిశ్రామికీకరణ వలన వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకై నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడవ పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వలన 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదవ సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహారత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 మంది శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్ యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4వేలు నుండి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుండి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి ఆశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఓడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే భాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం.

ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి.

తెలుగు ప్రజల హక్కు.. విశాఖ ఉక్కు

యు.రామస్వామి,
ప్రధాన కార్యదర్శి,
స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్
యూనియన్ (సిఐటియు)

విశాఖ స్టీల్‌ప్లాంట్ వెనుక తెలుగు ప్రజల చారిత్రక పోరాట నేపథ్యం వుంది. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' నినాదంతో 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు ఏకోన్ముఖంగా పోరాడి సాధించుకున్న ఘనత దీనిది. ఉక్కు పరిశ్రమ పురోగమనంలో కార్మికులు, ఉద్యోగుల కఠోర శ్రమ వుంది. ప్రభుత్వాల సహాయ నిరాకరణ, కుట్రలపై ప్రతిఘటన వుంది. ఆది నుంచి ప్రభుత్వాల కుట్రలు, కుతంత్రాలను ఎదురొడ్డి ఉక్కు పరిశ్రమను నిలబెట్టుకోవడంలో ప్రజల పాత్ర వుంది. సోషలిస్టు రష్యా సహకారం వుంది.

అది 1963వ సంవత్సరం. ఐదో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటికే భిలాయ్, బొకారో, రూర్కెలా, దుర్గాపూర్‌లో స్టీల్‌ప్లాంట్‌లు ఉండడంతో, సముద్ర తీరానవున్న విశాఖపట్నం అనుకూల స్థలమని ఆంగ్లో ఇండియన్ కన్సార్టియం ప్రతిపాదించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని 1966 జులై 1న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపింది. దీనికి ఆనాటి కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా లేదు. అయితే, వెనుకబడిన విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి దొరుకుతుందని నాడు అందరిలో ఆశ చిగురించింది. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని 1966 అక్టోబర్ 21న విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని నినదించారు. రైళ్లను ఆపేశారు. ఉద్యమ నినాదం తెలుగు ప్రజల్లోకి బలంగా వెళ్లింది. సాధించుకోవాలన్న పట్టుదల పెరిగింది. ఇది భరించలేని ప్రభుత్వం 1966 నవంబరు 1న ఉద్యమకారులపై కాల్పులు జరిపి 9 మందిని బలితీసుకుంది. దీన్ని నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, యువకులు, ప్రజలపై ప్రభుత్వం దమనకాండకు దిగి 32 మంది ప్రాణాలను బలిగొంది.

కాల్పులను నిరసిస్తూ, విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని డిమాండ్‌తో కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు, తెన్నేటి విశ్వనాథం వంటి 14 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారు. అమృతరావు నిరాహారదీక్ష ప్రారంభించారు. ప్రజాపోరాటాల ధాటికి తట్టుకోలేక నాటి కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. 1970 ఏప్రిల్ 17న నాటి ప్రధాని ఇందిరా గాంధీ విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటును ప్రకటించి, 1971 జనవరి 20న పైలాన్ ఏర్పాటుచేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి 16,500 మంది రైతులు ముందుకొచ్చి, 64 గ్రామాలు ఖాళీచేసి 22 వేల ఎకరాల భూములిచ్చారు.

కేంద్రం సహాయ నిరాకరణ : అప్పులతో వడ్డీల భారం

స్టీల్ అథారిటీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 1982 ఫిబ్రవరి 18న వేరుచేసింది. 20 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించాల్సిన స్టీల్‌ప్లాంట్‌ను రేషనలైజ్డ్ కాన్సెప్ట్ పేరుతో 3.4 మిలియన్ టన్నులకు పరిమితం చేసి కేంద్రం కేవలం రూ.4,889 కోట్లు కేటాయించింది. మిగిలిన డబ్బులు వివిధ బ్యాంకుల్లో అప్పులు చేసి 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకొని 1991లో ఉత్పత్తి ప్రారంభించారు.

దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లను కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించగా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర సహకారం లేకపోవడంతో, అప్పులుచేసి నిర్మించడంతో వడ్డీల భారం పెరిగింది. వడ్డీలు పెరిగి నష్టాలు రావడంతో 1999లో బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బిఐఎఫ్‌ఆర్‌కు నివేదించి, ప్రయివేటీకరణ వాదన ముందుకు తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా పోరాటం జరగడంతో రూ.1500 కోట్లు కేటాయించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించకపోయినా, బహిరంగ మార్కెట్‌లో గనులు కొనుక్కొని, 120 శాతం సామర్థ్యంతో నడిచేలా కార్మికులు, ఉద్యోగులు విశేష కృషిచేశారు. 2002 నుంచి (మిగతా 8లో..)

విశాఖ పోర్టు

నగరాభివృద్ధిలో విశాఖ పోర్టు పాత్ర

బి.జగన్, కార్యదర్శి,
యునైటెడ్ పోర్టు అండ్
డాక్ ఎంప్లాయీస్
యూనియన్,

విశాఖనగర అభివద్ధిలో విశాఖపోర్టు కీలకం. అతి తక్కువ రేటుతో సరుకుల రవాణా చేస్తోంది. అందుకే పోర్టు ఆధారంగా ముడిసరుకులు తెచ్చేకునే ఇతర ప్రభుత్వరంగ, ప్రైవేటు పరిశ్రమలు ఇంతలో ఏర్పడ్డాయి. దీంతో ఒక మత్స్యకార పల్లె మహానగరంగా అభివృద్ధి కావడానికి విశాఖపట్నం పోర్టు బీజం వేసింది.

విశాఖ పోర్టు బ్రిటీష్ కాలంలోనే 1933 సంవత్సరంలో పూర్తిస్థాయిలో ప్రారంభమైన పోర్టు స్వాతంత్ర్యం అనంతరం వివిధ పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రభుత్వరంగంలో మేజర్‌పోర్టుగా అభివృద్ధి చెందింది. 2000 దశకంలో వరుసగా 7సంవత్సరాలు నెంబర్ వన్ పోర్టుగాను, తరువాత మూడేళ్లు రెండవ స్థానంలో నిలిచింది. అనేక రికార్డులను నెలకొల్పడమేగాక లాభాల బాటలో పయనిస్తోంది. 2018లో రూ.259 కోట్లు, 2019లో రూ.200 కోట్లు, 2020లో రూ.274 కోట్లు, 2021లో రూ.238 కోట్లు, 2022లో రూ.275 కోట్లు, 2023లో రూ.380 కోట్లు, 2023-24లో సుమారు రూ.700 కోట్లు లాభాలతో విశాఖ పోర్టు నడుస్తోంది. రిజర్వ్ ఫండ్స్ రూ.3,582 కోట్లు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రభుత్వరంగంలో ఉండటం వల్ల దళిత, గిరిజన తరగతులకు రిజర్వేషన్లు ద్వారా ఉపాధి అవకాశాలు దక్కాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రూపాల్లో ఆదాయాలు సమకూర్చుతోంది. 2023లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు (మిగతా 4లో..)

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

(మొదటి పేజీ తరువాయి..)

బలంగా లేదు. దేశ పారిశ్రామిక అవసరాలను తీర్చగలిగే సామర్థ్యం దానికి లేదు. సాంకేతిక సహాయంగానీ, పెట్టుబడులు పెట్టే రూపంలోగానీ మన స్వావలంబనకు తోడ్పడడానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర పెట్టుబడిదారీ దేశాలు సుముఖంగా లేవు. ఆ తరుణంలో మనకు నిస్వార్థంగా సహాయం అందించి మన కాళ్ళమీద మనం నిలబడేలా చేయడానికి తోడ్పడింది సోవియట్ యూనియన్ నాయకత్వంలోని సోషలిస్టు శిబిరం. ఆ సహాయాన్ని అందుకుని నెహ్రూ దేశంలో ప్రభుత్వ రంగ స్థాపనకు, భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి బాటలు వేశారు.

రౌర్కెలా, భిలాయ్, దుర్గాపూర్, బొకారో ఉక్కు కర్మాగారాలు ప్రభుత్వ రంగంలో ఏర్పడింది నెహ్రూ కాలంలోనే. ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్, భాక్రా డామ్, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, హిరాకుండ్ డామ్ 1947-48 నాటికే మొదలయ్యాయి. హిందూస్తాన్ మెషిన్ టూల్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, హిందూస్తాన్ షిప్‌యార్డ్, భారత్ పెట్రోలియం, హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ యాంటీ బయోటిక్స్, హిందూస్తాన్ ఇన్‌సెక్టిసైడ్స్, నాగార్జున సాగర్ ప్రాజెక్టు, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటివి 1950 దశకంలో ప్రారంభమయ్యాయి. నేషనల్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్స్, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎర్త్ మూవర్స్ వంటి పరిశ్రమలు 1960 దశకంలో మొదలయ్యాయి.

ఈ పరిశ్రమలేవీ ప్రస్తుత ప్రభుత్వాలు ఆరోపిస్తున్నట్టు దేశ ఆర్థిక వ్యవస్థకు గుదిబండలుగా ఆ కాలంలో నడవలేదు. మన దేశ అవసరాలను తీర్చగలగడమే కాకుండా అవి ఆర్థిక వనరులను సమీకరించే సాధనాలుగా కూడా పని చేశాయి. 1965 వరకూ ప్రైవేటు రంగం కన్నా అధికంగా పెట్టుబడులను సమీకరించగలిగాయి. 1950 దశకంలో ప్రారంభించిన హెచ్‌ఎంటి పరిశ్రమ సాధించిన లాభాలతోటే రెండో హెచ్‌ఎంటి యూనిట్‌ను 1961లో

నెలకొల్పగలిగామని నెహ్రూ సగర్వంగా ప్రకటించారు. ఆ కాలంలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, జపాన్, చైనా వంటి దేశాల వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటు భారతదేశం నమోదు చేయగలిగింది. ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు లేనిదే ఆర్థికవృద్ధి సాధ్యం కాదంటూ నేడు మోడీ నుండి చంద్రబాబు వరకూ చేస్తున్న ప్రచారం ఎంత అవాస్తవమో ఈ అనుభవాలే చెప్తున్నాయి. ప్రైవేటు రంగంలో ఉన్న ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలను జాతీయం చేసిన తర్వాత పెట్టుబడుల సమీకరణ శక్తి ఎన్నో రెట్లు పెరిగింది. వీటిద్వారా ప్రజలే దేశానికి కావలసిన పెట్టుబడులను అందించారు.

1990 దశకంలోని పివి నరసింహారావు ప్రభుత్వం కాలంలో నెహ్రూ విధానాలను తిరగదోడి నయా ఉదారవాద విధానాలకు, ప్రైవేటీకరణకు తెర తీశారు. ఆనాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ తర్వాత కాలంలో ప్రధానమంత్రి అయ్యారు. ఆయన నేతృత్వంలోని యుపిఎ -1 ప్రభుత్వ కాలంలో 2008లో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను సమూలంగా కుదిపివేసిన ఆర్థిక సంక్షోభం గురించి మనకు తెలుసు. ఆ సంక్షోభం తాకిడిని భారతదేశం తట్టుకోగలిగిందంటే అందుకు కారణం ప్రభుత్వ రంగమే. "మన ఆర్థిక వ్యవస్థలోని మూలాలు బలంగా ఉండడం వల్లనే సంక్షోభాన్ని తట్టుకున్నాం" అని మన్మోహన్ సింగ్ ఆ రోజుల్లో ప్రకటించారు. ఏమిటా మూలాలు ? మన ప్రభుత్వ రంగమే. ప్రధాన పరిశ్రమలు, ఆర్థిక రంగం ప్రభుత్వ రంగంలోనే కొనసాగడం వల్లనే ప్రపంచ సంక్షోభ తాకిడిని తట్టుకున్నాం. కానీ మోడీ ప్రభుత్వం ఆ పటుత్వాన్ని దెబ్బ తీసే పనిలో దూకుడుగా పోతోంది. ఇది దేశద్రోహం తప్ప మరొకటి కాదు.

మన వ్యవసాయ రంగం స్వతంత్రం వచ్చేనాటికి చాలా ఘోరమైన పరిస్థితిలో ఉండేది. ఒక కోటి నలభై లక్షల టన్నుల ఆహారధాన్యాలను 1946-1953 మధ్య దిగుమతి చేసుకోవలసివచ్చింది. ఈ దుస్థితి నుండి బయటపడడమే గాక నేడు మనం భారీగా ఆహారధాన్యాల నిల్వలను నిర్వహించుకోగలుగుతున్నాం. దీనికి కారణం నెహ్రూ కాలపు విధానాలు. సహకార వ్యవస్థను పటిష్టం చేయడం, (మిగతా 5లో..)

ప్రజల పొదుపునకు భద్రత ఎల్ఐసి

విశాఖలోని ఎల్ఐసి కార్యాలయం

1956లో కేవలం రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ప్రభుత్వ రంగసంస్థ ఎల్ఐసి ఆస్తులు, నేడు రూ.46లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2022-23 మొదటి క్వార్టర్‌తో పోల్చితే, 2023-24 మొదటి క్వార్టర్‌లో 1300శాతం లాభం (రూ.9544 కోట్లు) ఎల్ఐసి ఆర్జించడం విశేషం. దేశీయ బీమారంగంలో ప్రయివేటు కంపెనీల ప్రవేశం జరిగి 23ఏళ్లయినా, నేటికీ ప్రీమియమ్ ఆదాయంలో 63 శాతం, పాలసీలలో 72శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. దేశంలో లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో ఎల్ఐసి తర్వాత 2వ స్థానంలో ప్రయివేటు బీమా కంపెనీ ఎస్‌బిఐ లైఫ్ కంపెనీ ఉంది. ఎల్ఐసి మార్కెట్ వాటా 63 శాతంతో పోలిస్తే ఎస్‌బిఐ లైఫ్ మార్కెట్ వాటా 8శాతం మాత్రమే ఉంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో ఎల్ఐసి ప్రపంచ రికార్డును కలిగి ఉంది. సర్వీసు విషయంలోనూ, క్లెయిమ్ సెటిల్‌మెంట్, నిర్వహణ సామర్ధ్యాలు, ఉత్పాదకత పరంగా ప్రపంచంలోని మరే ఇతర కంపెనీ కూడా ఎల్ఐసికి సాటి లేదు. ప్రపంచంలో 99శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో ఎల్ఐసి ఉంది. రక్షణ రంగం, రైల్వేల తర్వాత ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉంది. ఫార్చ్యూన్ గ్లోబల్ సూచీ-2023లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియం ఆదాయంలో ప్రపంచంలో పదవ అతి పెద్ద సంస్థగా ఎల్ఐసి నిలిచింది.

జి.వరప్రసాద్,
ప్రధాన కార్యదర్శి,
ఐసిఇయు, విశాఖపట్నం డివిజన్

'ప్రజలు దాచుకున్న పొదుపు ప్రజల శ్రేయస్సు, దేశ ఆర్థిక స్వావలంబన కోసమే' నినాదంతో 1956 నుంచి, ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు రూ.40లక్షల కోట్ల పైబడి పెట్టుబడులుగా పెట్టింది. 31 మార్చి 2022 నాటికి ఎల్ఐసి రూ.40,84,826 కోట్ల పెట్టుబడులను మన దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ.28,85,569 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. సుమారు ఒక లక్ష ఉద్యోగులను మాత్రమే కలిగిన ఎల్ఐసి సంస్థ దాదాపు 30కోట్ల వ్యక్తిగత పాలసీలకు సేవలు అందిస్తోంది. ఎల్ఐసి సంస్థ కోసం పని చేసే 13.43లక్షల ఏజెంట్‌లలో 48శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నారు. నేడు దేశీయ బీమా రంగంలో ఉన్న 26 ప్రయివేటు బీమా కంపెనీలు అన్నీ కలిపి దేశంలో ఉన్న 79శాతం జిల్లాల్లో ఆఫీసు లు కలిగి ఉంటే,ఒక్క ఎల్ఐసి సంస్థనే దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉంది.అలాంటి జీవిత బీమారంగం ఎల్ఐసిని దొంగదెబ్బ తీసేందుకు కేంద్రం కుట్ర చేస్తోంది.

ప్రభుత్వ బీమారంగ ప్రయోజనాలకు ప్రతికూలంగా కొన్ని విధాన నిర్ణయాలకు బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డిఏఐ) యత్నిస్తోంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనుందని ప్రచారం జరిగినా, ప్రభుత్వం వెనక్కు తగ్గింది. బీమా చట్ట సవరణల ద్వారా, కనీస మూలధన అవసరాన్ని మార్చాలని, కమిషన్ చెల్లింపులో మార్పులను, మిశ్రమ లైసెన్సుల జారీని అనుమతించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సవరణలు అమలైతే, ప్రజల పొదుపుకు హాని కలిగించే మోసపూరిత అవకాశాలు ఉన్న1956కి ముందు ఉన్న కాలానికి బీమా రంగం వెళ్లినట్లవుతుంది.

స్టాక్ మార్కెట్‌లో నమోదైన మార్కెట్ క్యాపిటలైజషన్ కన్నా, ఎల్ఐసి నిజవిలువ కొన్ని రెట్లు ఉంటుందనే వాస్తవాన్ని ప్రజలకు, పాలసీదారులకు తెలియచెప్పడానికి జనసభలు, వీధి సమావేశాలు దేశవ్యాప్తంగా నిర్వహించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇప్పటికే పిలుపునిచ్చింది.

స్వదేశీ స్వదేశీ అని ఎప్పుడూ దేశ భక్తిని ప్రబోధిస్తూ, మేకిన్ ఇండియా నినాదంతో ఫేక్ స్లోగన్స్ ఇస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలు ఎండగట్టాలి. కార్మికులు, ప్రజలు ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడం ద్వారా మాత్రమే ఇది సాధ్యం

హెచ్‌పిసిఎల్ పరిశ్రమ

పారిశ్రామికాభివృద్ధిలో...

హెచ్‌పిసిఎల్ కీలక భూమిక

చరిత్రలోకి చూస్తే అనకాపల్లి, భీమిలి కనిపించినంతగా విశాఖ కనిపించదు. విశాఖ ఒక సాధారణ జాలరి పల్లెటూరు. కానీ నేడు ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్దనగరం విశాఖ. ఈ నగరాభివృద్ధి ప్రధాన పాత్ర ప్రభుత్వ రంగ సంస్థలదే. వాటిల్లో ప్రధానమైనది కాల్‌టెక్స్ ఆయిల్ ఇండియా రిఫైనరీగా 1952లో స్థాపించబడి, 1976 హెచ్‌పిసిఎల్‌లో విలీనమైన నేటి విశాఖ రిఫైనరీ.

కెఎన్.సత్య,
ప్రధాన కార్యదర్శి,
హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)

అయితే లాభదాయక చమురు శుద్ధి, వాటి ఉత్పత్తుల అమ్మకాన్ని ప్రభుత్వ రంగంలోకి రావడానికి చాలా చరిత్రే వుంది. పెట్రోలు, డీజల్, వంటగ్యాస్, ఇతర ఇంధనాలను సరఫరా చేసే ఈ రంగానికి మొత్తం ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేయగల సత్తా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి, ప్రయివేటు రంగంలోని ఆమెరికా బహుళ జాతి సంస్థలు కాల్‌టెక్స్, ఎస్సో, షెల్‌లాంటి సంస్థలదే పైచేయిగా వుండేది.

1971 పాకిస్తాన్ యుద్ధకాలంలో యుద్ధ నౌకలు, విమానాలకు ఇంధనం సరఫరాకు నిరాకరించి, మన దేశ సైనిక అవసరాలకు వ్యతిరేకంగా పనిచేశాయి. దీంతో పార్లమెంటులో చట్టం చేసి, ఈ విదేశీ బహుళ జాతి సంస్థలను జాతీయం చేసి హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్‌లను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థగా ఆవిర్భవించిన తర్వాత మరింత సామాజిక బాధ్యతతో ఈ ప్రాంతం అభివృద్ధికి హెచ్‌పిసిఎల్ విశేషకృషి చేస్తోంది. కెజిహెచ్, పాఠశాలలు, పారిశుధ్యం కోసం నిధులను కేటాయిస్తుంది. నగర నడిబొడ్డున సిరిపురంలోని వాల్తేరు పార్క్ క్వార్టర్స్ హెచ్‌పిసిఎల్ ఉద్యోగుల నివాస కాలనీ, శ్రీహరిపురంలో వున్న యరాడ పార్క్ క్వార్టర్స్ పచ్చదనానికి, నగర అందాలకు ప్రత్యేకశోభను సంతరింపజేస్తున్నాయి.

ప్రజలకు సామాజిక న్యాయం జరగాలన్నా, ప్రయివేటు సంస్థల దోపిడీని అదుపులో పెట్టలన్నా అది ప్రభుత్వ రంగ సంస్థలకే సాధ్యం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో హెచ్‌పిసిఎల్ తనదైన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తుందనడంతో అతిశయోక్తి లేదు.

నగరాభివృద్ధిలో విశాఖ పోర్టు పాత్ర

(3వ పేజీ తరువాయి..)

రూ.171 కోట్లు పన్నులు చెల్లించింది. ఆస్తి పన్ను రూపంలో 2022లో రూ.62 కోట్లు, 2023లో రూ.71 కోట్లు గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌కు చెల్లించడం ద్వారా నగరంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి దోహదపడింది. సామాజిక బాధ్యతగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కూడా సొంతంగా చేపడుతోంది. ఈ సంవత్సరం సుమారు రూ.35 కోట్లు సిఎస్‌ఆర్ నిధులను వివిధ ప్రాంతాల్లో విద్య, సామాజిక సేవలకు అందించింది. క్రీడా మైదానాలు, సాంస్కృతిక కేంద్రాలు కమ్యూనిటీ హాల్స్, విద్య, ఆరోగ్యం తదితర రంగాలలో అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోంది.

తిరోగమన దిశలో

ఇంత అభివద్ధికి దోహదం చేస్తున్న విశాఖపోర్టు ప్రైవేటీకరణ వల్ల రోజురోజుకూ కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి.

దీంతోపాటు సామాజిక న్యాయం దెబ్బతింటోంది. పోర్టుకు వచ్చే ఆదాయం తగ్గడంతో నగర అభివృద్ధిపైన ప్రభావం పడుతుంది. కన్నతల్లివంటి విశాఖపట్నం పోర్టును బలహీనపరిచే చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. పక్కనే గంగవరం మైనర్ పోర్టు ఏర్పాటుతో విశాఖ పోర్టుకు నష్టం వాటిళుతోంది. దీని వల్ల విశాఖపోర్టు దేశపట్టికలో 6వ స్థానానికి దిగజారింది. గత 7 సంవత్సరాల కాలంలో సుమారుగా 3000 మంది పర్మినెంట్ కార్మికులు తగ్గారు.

ప్రస్తుతం2800 మంది మాత్రమే ఉన్నారు. పోర్టులో ఇప్పటికే 8బెర్తులు పిపిపి, బిఒటి క్రింద అప్పగించారు. ఇప్పుడు మరో 6 బెర్తులు నేషనల్ మోనిటైజేషన్ పైపులైన్ (ఎన్.ఎం.పి.ఎస్) కింద ప్రైవేట్‌వారికి ఇచ్చారు. ఈ 6 బెర్తులు ప్రైవేట్‌పరం అయితే సుమారుగా 1500 మంది పర్మినెంట్, 1000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనికోల్పోతారు. పోర్టు క్వార్టర్లు, స్టేడియం, కల్యాణమండపాలు ప్రైవేట్‌వారికి అప్పజెప్పారు. ఈ క్రమం కొనసాగితే కార్గో హేండ్లింగ్ బాధ్యత నుంచి పూర్తిగా వైదొలగి పోర్టు కేవలం ఫెసిలిటేటర్ సంస్థగా మారుతుంది. ఈ సంస్థల నుంచి రాయల్టీ ద్వారా వచ్చే ఆదాయం స్వల్పం మాత్రమే. ఈ విధానాల వల్ల పెద్దఎత్తున పోర్టుకు రావాల్సిన ఆదాయం కోల్పోతుంది. ప్రైవేట్ సంస్థలు పెద్దఎత్తున లాభపడతాయి.

ప్రస్తుతం పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుపరం చేసేందుకు టెండర్లు పిలిచారు. దీంతో 40వేల మంది ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారనుంది. విశాఖపట్నం పోర్టు ప్రజల ఆస్తి. ఇటువంటి పోర్టు, హాస్పిటల్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడంలో కార్మికులు, కార్మిక సంఘాలతో పాటు యావత్తు ప్రజానీకం కూడా ఉద్యమించి కాపాడుకోవాలి.

ప్రైవేటీకరణ కాబోతున్న రక్షణ రంగ పరిశ్రమలు

- రెడ్డి వెంకటరావు, చైర్మన్, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ, విశాఖపట్నం

23వేల కిలోమీటర్ల సుదీర్ఘ భూ, సముద్ర తీరాల సరిహద్దులను, ప్రపంచంలోనే మూడవ సైనిక శక్తిగా ఉన్న భారత రక్షణ దళాలు కాపాడుతున్నాయి. వీటికి కావలసిన సాయుధ సంపత్తిని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పరిశ్రమలు ప్రధానంగా సమకూర్చు తున్నాయి. నిత్యం సరిహద్దుల్లో అలజడలు, ముఖ్యంగా చైనాతో జరిగిన యుద్ధం తరువాత భారత ఆయుధ పరిశ్రమలను బలోపేతం చేయాలని ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కంకణం కట్టుకున్నారు. ఆనాటికే ఉన్న ఆయుధ పరిశ్రమలను ఆధునికీకరించి, కొత్త వాటిని నెలకొల్పారు. ఆధునిక ఆయుధాలు తయారీకి రక్షణ ప్రయోగశాలలను స్థాపించారు. డాక్‌యార్డ్‌ల నిర్మాణం చేపట్టారు. ఈ విధంగా 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, 52 డిఆర్‌డిఓ ప్రయోగశాలలు, 36 ఈఎంఈ వర్క్ షాపులు, అనేక మిలటరీ డెయిరీ ఫారాలు, డాక్ యార్డులు, షిప్ యార్డులు రక్షణ రంగంలో నెలకొల్పబడ్డాయి. ఇవి కాకుండా బీడీఎల్, హెచ్‌ఎఎల్ మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ రంగ పరికరాలను, ఆయుధాలను తయారు చేసేవి. బ్రిటిష్ కాలం నుండి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆయుధ పరిశ్రమల్లోకి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు ప్రవేశించకుండా నాటి కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టపరమైన చర్యలు తీసుకున్నది.

మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రైవేటీకరణ

సరళీకరణ విధానాలు నేపథ్యంలో రక్షణ రంగాన్ని ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు పూనుకున్నాయి. స్వదేశీ జపంతో మేక్ ఇన్ ఇండియా పేరు చెప్పి అధికారం చేపట్టిన నేటి ప్రధాని నరేంద్ర మోడీ హద్దులు తొలగించుకొని రక్షణ రంగ సంస్థలన్నీ స్వదేశీ, విదేశీ బహుళజాతి గుత్త సంస్థల పరం అవుతున్నాయి. మోడీ ప్రధాని అయిన తర్వాత ఈఎంఈ వర్క్ షాపులు, మిలటరీ డెయిరీ ఫారాలు శాశ్వతంగా మూతపడ్డాయి. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విడగొట్టారు. ఇవి తయారు చేసే ఉత్పత్తులను ప్రైవేటు వారికి అప్పగించి, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల సామర్థ్యానికి అనుగుణంగా ఆర్డర్లు ఇవ్వడం మానేశారు. నష్టాలు పేరు చెప్పి క్రమేపి వీటిని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నారు. వివిధ డాక్ యార్డ్‌ల్లో పనులను ఆఫ్ లోడింగ్ పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. రక్షణ రంగ ప్రయోగశాలలకు అవసరమైన నిధులు కేటాయించకుండా నూతన పరిశోధనలకు మోకాలడ్డుతున్నారు. హెచ్‌ఎఎల్ తయారు చేసే యుద్ధ విమానాలు అంబానీకి, అణు జలాంతర్గాముల నిర్మాణాలను ఎల్ అండ్ టి కంపెనీకి అప్పగించారు. యుద్ధ నౌకల నిర్మాణం అంబానీ పరం కాబోతున్నది. ఒకనాడు దేశంలో సుమారు 5 లక్షల మంది డిఫెన్స్ సివిల్ ఉద్యోగులు, కార్మికులు రక్షణ రంగంలో పని చేయగా, నేటి మోడీ ప్రభుత్వ చర్యల వల్ల నేడు ఆ సంఖ్య రెండు లక్షలకు తగ్గిపోయింది.

1941లో రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ నౌకల రిపేర్లకు నేటి విశాఖ నావెల్ బేస్‌లో బేస్ రిపేర్ యార్డ్ (బిఆర్‌ఓ) ఆయుధ గిడ్డంగి (ఎన్‌ఎడి)లకు అంకురార్పణ జరిగింది. చైనాతో యుద్ధం తర్వాత తూర్పు నౌకాదళ విస్తరణతో పాటు, బేస్ రిపేర్ యార్డ్‌గా ఉన్న చిన్న రిపేర్ వర్క్ షాపును, ఆధునిక యుద్ధ నౌకలు, జలాంతర్గాముల మరమ్మతులకు అవసరమైన ఆధునిక నావెల్ డాక్‌యార్డ్, ఆసియాలోనే అతిపెద్దదైన డ్రై డాక్‌ల నిర్మాణానికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మెటీరియల్ ఆర్గనైజేషన్, డబ్ల్యూడి, సిటిడబ్ల్యూ, బివి యార్డ్ మొదలగు అనుబంధ సంస్థలు నిర్మించబడ్డాయి. ఇదే కాలంలో ఎన్‌ఎస్‌టిఎల్ నిర్మాణం చేపట్టారు. నావెల్ ప్రాజెక్టులు నిర్మాణానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావెల్ ప్రాజెక్ట్స్ (డిజిఎన్‌పి), నిర్వహణకు మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ (ఎంఈఎస్)లు ఈ కాలంలోనే విస్తరించారు. 1989 తర్వాత షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. 1980 దశకంలో విశాఖ రక్షణ రంగంలో 15,000 మంది పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులు పనిచేసేవారు. నేడు ఆ సంఖ్య 8 వేలకు తగ్గిపోయింది.

ఆయుధాలు భద్రపరచడంతో పాటు వాటిని నిర్వహించే ఎన్‌ఎడి పనులను కూడా ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా రాంబల్లి దగ్గర అంబానీ డిఫెన్స్ యూనిట్ వస్తే.. దేశీయ రక్షణ రంగ సంస్థలతో పాటు విశాఖ రక్షణ రంగ సంస్థలు దెయ్యాల కొంపలుగా మారే పరిస్థితి వస్తుంది. రక్షణ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరమైతే పెట్టుబడిదారులకు కాసులు పండిస్తాయి. ఉగ్రవాదులకు, విచ్ఛిన్నకర శక్తులకు ఆయుధాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజల ప్రాణాలకు, దేశభద్రతకి, రక్షణకి ప్రమాదం ముంచుకొని వస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే ప్రస్తుత విధానాలను మార్చడానికి ఐక్య పోరాటాలు చేయడమే శరణ్యం.

బిఎస్‌ఎన్‌ఎల్ అమూల్య సేవలు

- కె.రమాదేవి, సర్కిల్ సెక్రటరీ, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్

దేశ టెలికం రంగంలో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు అమూల్యమైనవి. స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలందించింది. ప్రతి మారుమూల పల్లెనూ పలకరించింది. అయితే, నయాఉదారవాద విధానాలు వచ్చాక, అందునా మోడీ సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చాక సంస్థ రానురానూ దిగజారింది. 4జి, 5జి సాంకేతిక పరిజ్ఞానం లేని కారణంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. అయితే తాజాగా ప్రైవేటు టెలికం ఆపరేటర్లు వినియోగదారుల సెల్ టారిఫ్ ఛార్జీలను విపరీతంగా పెంచేయడంతో ప్రస్తుతం ఎక్కువ మంది బిఎస్‌ఎన్‌ఎల్‌వైపు చూస్తున్నారు. చౌకైన ధరతో సేవలను అందించే బిఎస్‌ఎన్‌ఎల్ 4జి, 5జిని తేవాలని వారంతా ఆకాంక్షిస్తున్నారు. ఆ మాటలు ప్రభుత్వం చెవికెక్కడం లేదు.

అక్టోబర్ 23 నాటికి మొబైల్ ఫోన్లలో బిఎస్‌ఎన్‌ఎల్ మార్కెట్ వాటా 8.08 శాతం. సాంకేతిక పరిజ్ఞానం అప్డేట్‌కాని కారణంగా కొంతకాలంగా సుమారు రెండు కోట్ల మంది వినియోగదారులను బిఎస్‌ఎన్‌ఎల్ కోల్పోయింది. అయితే, నెట్‌వర్క్ లేకపోవడం, కాల్‌డ్రాప్ అవడం వంటి ఎన్ని అవరోధాలు వచ్చినా ప్రభుత్వ రంగ సంస్థలను బలపర్చాలని ప్రగతిశీల వ్యక్తులు అనుకోబట్టే బిఎస్‌ఎన్‌ఎల్ ఇంకా 10 కోట్ల మంది పైచిలుకు వినియోగదారులను కలిగి ఉంది.

2014లో మన దేశంలో 4జి సేవలను ప్రారంభించారు. కానీ కేంద్రం 4జి స్పెక్ట్రంలో బిఎస్‌ఎన్‌ఎల్‌కు ఏ కేటాయింపూ చేయలేదు. ఉద్యోగ సంఘాలు, అధికారుల సంఘాలు దీర్ఘకాలం పాటు ఆందోళన చేశాక 2019 అక్టోబర్‌లో అనుమతి లభించింది. బిఎస్‌ఎన్‌ఎల్ వద్ద 4జి టెక్నాలజీకి అనువుగా ఉండే బిటిఎస్‌లు 49,300 ఉన్నాయి. వీటిని పూర్తి స్థాయి 4జి బిటిఎస్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తే దేశవ్యాప్తంగా బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలను అందించగలిగేది. కానీ ఆ విధంగా అప్‌గ్రేడ్ చేయడానికి కేంద్రం అనుమతి నిరాకరించింది. దాని వల్ల బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలను 2023 వరకు ప్రారంభించలేకపోయింది. ఇంకోపక్క ఉన్న బిటిఎస్‌లను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కనుక మార్చి 2020లో బిఎస్‌ఎన్‌ఎల్ 50000 బిటిఎస్‌లను కొత్తగా కొనుగోలు చేయడానికి గ్లోబల్ టెండర్లను పిలిచింది. నోకియా, ఎరిక్‌సన్, సామ్‌సంగ్ వంటి కంపెనీలు మాత్రమే వీటిని సరఫరా చేయగల సామర్థ్యం కలిగివున్నాయి. ప్రభుత్వం మళ్ళీ అడ్డుపడింది. భారతదేశంలోని అమ్మకందారుల వద్ద నుండి మాత్రమే వాటిని కొనుగోలు చేయాలన్న షరతు పెట్టింది. కానీ భారతదేశంలో వాటిని సరఫరా చేయగలిగిన కంపెనీలు ఏవీ లేవు. ఇంకోపక్క ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా వంటి కంపెనీలు మాత్రం గ్లోబల్ టెండర్ల ద్వారా వాటికి కావలసిన పరికరాలను కొనుగోలు చేసుకున్నాయి. ఆ ప్రైవేట్ కంపెనీల మీద ప్రభుత్వం ఎటువంటి షరతులనూ పెట్టలేదు. ప్రైవేటు కంపెనీలకు పోటీగా బిఎస్‌ఎన్‌ఎల్ రంగంలోకి దిగకుండా ఉండడానికే కేంద్ర ప్రభుత్వం తన సొంత సంస్థ కాళ్లు, చేతులు కట్టివేసింది. ఆ సంస్థలన్నీ మొత్తం మార్కెట్‌ను ఆక్రమించుకుని ఉన్నాయి. ఇప్పుడు వినియోగదారులపై ఛార్జీల భారం వేస్తున్నాయి. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియాలు తమ టెలిఫోన్ టారిఫ్‌లను పెంచిన కారణంగానూ, ఇప్పుడిప్పుడే 4జి సేవలను బిఎస్‌ఎన్‌ఎల్ తెస్తున్నందున మరలా లక్షల సంఖ్యలో కస్టమర్లు బిఎస్‌ఎన్‌ఎల్‌వైపు తిరిగి వస్తున్నారు.

దేశానికి వెన్నెముక ప్రభుత్వ రంగం

(3వ పేజీ తరువాయి..) వ్యవసాయ రంగంలో పరిశోధనల ద్వారా అధిక దిగుబడి సాధించడం, నీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు గ్యారంటీ చేయడం, ఎరువులు తదితర ఇన్‌పుట్స్‌కు సబ్సిడీలు ఇవ్వడం వంటి విధానాలు మన ఆహార స్వావలంబన సాధనకు దారి తీశాయి. ఇప్పుడు మోడీ ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాల ద్వారా వాటన్నింటినీ రద్దు చేసి మళ్లీ తిండి కోసం ఇతర దేశాలను చిప్ప పట్టుకుని అడుక్కునే స్థితికి తీసుకుపోవాలని చూస్తోంది.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రతిష్టాత్మకమైన ఐఐటిలు, ఐఐఎంలు, ఎయిమ్స్ సంస్థలు, డిఆర్‌డిఒ ల్యాబ్స్, వంటివి నెహ్రూ కాలంలోనే ప్రారంభమయ్యాయి. 1949 నాటికి కేవలం రూ.10 కోట్లు మాత్రమే శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు కేటాయించిన పరిస్థితి నుండి 1977 నాటికి రూ.4500 కోట్లు కేటాయించే స్థాయికి ఎదిగామంటే ఈ విధానాలే కారణం. మళ్ళీ మోడీ కాలంలో ఈ కేటాయింపులన్నీ తగ్గిపోయి ఇతర దేశాల కన్నా చాలా దారుణంగా వెనుకబడిపోతున్నాం. విద్యా, వైద్య రంగాలలో, పేదరిక స్థాయిని తగ్గించడంలో, సామాజిక న్యాయాన్ని ఆచరించడంలో మన దేశం ఎన్నో విజయాలను సాధించింది.

ఇంత విశిష్టత ఉన్న నెహ్రూ కాలపు విధానాలను ప్రజానీకం మరిచిపోయేలా చేసినప్పుడే మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెట్టడం తేలికౌతుంది. అందుకే నెహ్రూ మీద విషం కక్కుతున్నారు. కానీ దేశభక్తులు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, రైతులు అందరూ ఈ కుట్రలను సాగనివ్వకుండా ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనను మరింత విస్తృతంగా, శక్తివంతంగా ముందుకు తీసుకుపోవాలి. అదే మనందరిముందున్న కర్తవ్యం.

హిందుస్తాన్ షిప్‌యార్డు లిమిటెడ్

నౌకల నిర్మాణంలో దిట్ట హెచ్‌ఎస్‌ఎల్

- కెఎం.కుమారమంగళం, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు

అతి తక్కువ ఖర్చుతో సరకుల రవాణాకు ఏ దేశానికైనా నౌకలు చాలా అవసరం. ప్రపంచవ్యాప్తంగా నౌకా నిర్మాణ మార్కెట్ 2023లో 207.15 బిలియన్ డాలర్లు ఉండగా 2024 నాటికి 220.52 బిలియన్ డాలర్ల వృద్ధి నమోదు చేసింది. ఇది 6.5శాతం వృద్ధిని కలిగి ఉన్నది. నౌకా నిర్మాణ రంగంలో చైనా, సౌత్ కొరియా, జపాన్‌లు 94శాతం దగ్గర మార్కెట్ ఆధిపత్యాన్ని కలిగి ఉన్నాయి. భారతదేశం ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో 0.6శాతం మార్కెట్ భాగస్వామ్యం మాత్రమే కలిగి ఉంది. నౌకా నిర్మాణ రంగంలో పాసింజర్, కార్గో నౌకల ఎగుమతుల్లో 2023లో 25 బిలియన్ డాలర్లతో చైనా అగ్రస్థానంలో నిలిచింది. 16.7 బిలియన్ డాలర్లతో సౌత్ కొరియా 2వ స్థానంలో, 9.6 బిలియన్ డాలర్ల సామర్థ్యంతో ఎగుమతులతో జపాన్ 3వ స్థానంలో నిలిచింది. ఇండియా కేవలం 1.12 బిలియన్ డాలర్ల ఎగుమతి మాత్రమే చేయగలిగింది.

7,517 కిలోమీటర్ల విస్తారమైన తీరప్రాంతం కలిగిన భారత దేశ వాణిజ్య, రక్షణ అవసరాలకు నౌకలు కలిగి ఉండడం మరింత కీలకం. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ సహకారం లేకుండా నౌకానిర్మాణ రంగం మనుగడ సాగించిన పరిస్థితి లేదు. 80వ దశకంలో అంతర్జాతీయ సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో సహ నౌక నిర్మాణ దేశాలన్నీ వారి పరిశ్రమల రక్షణకు సబ్సిడీలు అందిస్తే.. భారతదేశం విదేశాల్లో నౌకల కొనుగోలుకు 30శాతం సబ్సిడీ ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చే నాటికి కోల్‌కత్తా, ముంబయి ప్రాంతాలలో చిన్న చిన్న నౌకా నిర్మాణ కేంద్రాలు రమారమి 12 ఉండగా, నేడు 30 ఉన్నాయి. వీటిల్లో 8 ప్రభుత్వరంగ సంస్థలుగా కొనసాగుతున్నాయి.

హిందూస్థాన్ షిప్‌యార్డు..

స్వాతంత్ర్య పోరాటం ఫలించే నేపథ్యంలో వాల్ చంద్ హీరా చంద్ 1944లో సింధియా స్టీమ్ నెవిగేషన్ కంపెనీ పేర (నేటి హిందూస్థాన్ షిప్పియార్డు) 8,000 డిడబ్ల్యుటి నిర్మాణ సామర్థ్యం కలిగిన రెండు స్లిప్ వేస్‌తో నౌకనిర్మాణ సంస్థను ఏర్పాటు చేశారు. తరువాత కాలంలో షిప్పియార్డును నడపలేక మూసివేయడానికి వాల్ చంద్ హీరా చంద్ సిద్ధపడగా నాటి నెహ్రూ ప్రభుత్వం 1951లో కొంతమేర, 1961 నాటికి పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తీసుకోవటం జరిగింది. హిందూస్థాన్ షిప్పియార్డు అనేక సంక్షోబాలను ఎదురుకొంటూ నేటికి 200 పైబడి అధిక సామర్థ్యం కలిగిన నౌకల నిర్మాణం చేసింది. వాణిజ్య నౌకలు, దేశరక్షణకు అవసరమైన యుద్ధ నౌకలు, తీరప్రాంత గస్తీ నౌకలు, రిగ్‌లతో పాటు సముద్ర గర్భంనుండి చమురు వెలికితీయడానికి అవసరమైన ప్లాట్ ఫామ్‌ల నిర్మాణలతో పాటు పరిశోధన అవసరాలకు కావాల్సిన అనేక వైరుధ్యం కలిగిన నౌకల నిర్మాణం చేసిన ఘనత హిందూస్థాన్ షిప్పియార్డు సొంతం. 2000 పైబడి నౌకలు, జలాంతర్గాముల రీఫిటింగ్‌తో సహ మరమ్మతులు చేసింది.

నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

కేంద్రంలోని బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమల నిర్వీర్యం, ప్రైవేటీకరణ వేగవంతం చేసింది. పరిశ్రమలు నడపడం ప్రభుత్వ పని కాదని, ప్రభుత్వరంగ పరిశ్రమలు చనిపోవడానికి పుట్టాయని, కొన్ని వెంటనే చనిపోతే మరికొన్ని రానున్న కాలంలో చనిపోతాయని, లేని పక్షంలో వాటిని తామే చంపేస్తామని ప్రధాని మోడీ 2014లోనే మొట్టమొదటి టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ పరిశ్రమలపై వివిధ కోణాలలో ప్రభుత్వం చేస్తున్న దాడిని మనం గమనించవచ్చు.

మోడీ ప్రభుత్వం తన విజన్ డాక్యుమెంట్లో 2030 నాటికి నౌకా నిర్మాణరంగంలో అంతర్జాతీయంగా 10వ స్థానానికి, 2047 నాటికి 5వ స్థానానికి ఎదగాలని నిర్దేశించుకున్నా.. వాస్తవంలో దానికి అనుగుణంగా నౌకా నిర్మాణరంగాన్ని బలోపేతం చేసే చర్యలు శూన్యం. 53వేల డిడబ్ల్యుటి సామర్థ్యం కలిగిన వాణిజ్య నౌకలను నిర్మించగలిగే హిందుస్థాన్ షిప్ యార్డ్ జిఎంఎల్ ఆర్డర్ తర్వాత వాణిజ్య నౌకల నిర్మాణాన్ని చేపట్టలేదు. టర్కీతో ఎఫ్ఎస్ఎస్ నౌకల నిర్మాణం రద్దయిన నేపథ్యంలో హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌కు 19 వేల కోట్ల విలువైన ఎఫ్ఎస్ఎస్ ఆర్డర్లను ఇచ్చినట్లే ఇచ్చి దొడ్డిదారిలో ఎల్ అండ్ టికి రెండు నౌకల నిర్మాణ బాధ్యతలను అప్పగించింది. రానున్న కాలంలో మిగిలిన నౌకలను కూడా ఇతర కారణాలను చూపి ఎల్ అండ్ టికి గాని, వేరే ఇతర ప్రైవేటు సంస్థలకు గాని మోడీ ప్రభుత్వం అప్పగించదని గ్యారెంటీ ఏమీ లేదు.

ప్రపంచవ్యాప్తంగా నౌక నిర్మాణ రంగాన్ని ఉపాధి కల్పనలో కీలక రంగంగా గుర్తిస్తారు. దీనికి భిన్నంగా భారతదేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలలో విఆర్ఎస్ పేర ఉద్యోగ విరమణ వలన కార్మికులు తగ్గిపోతున్నా ఆ ఖాళీల్లో నిపుణత కలిగిన కార్మికులతో భర్తీ చేయడం లేదు. 1977లో హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో 7133 మంది కార్మికులు పని చేయగా, నేడు అధికార్లుతో సహా 580 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు పనిచేస్తున్నారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి ద్వారా నిర్మితమైన ప్రభుత్వ రంగాన్ని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు కార్మిక వర్గంతో పాటు ప్రజాబాహుల్యాన్ని కలుపుకొని నిరంతరం పోరాటం కొనసాగించాలి. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవడం, ప్రజాధనంతో నిర్మితమైన ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం నేటి ప్రధాన కర్తవ్యం.

ఆర్థిక వ్యవస్థకు జీవనాడి బ్యాంకులు

నేడు ప్రైవేటీకరణ కత్తి

ఏ కార్పొరేట్ల వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులలో భారీగా పారు బకాయిలు పెరుగుతున్నాయో, వారి ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని చూడటం, వారికి బ్యాంకులను అప్పగించాలని చర్యలు తీసుకోవడం దురదష్టకరం. ప్రభుత్వ రంగ బ్యాంకులకు సరిపడినంత మూలధనాన్ని పెంచాలని, ఉద్దేశ్యపూర్వకంగా బ్యాంకు అప్పులు ఎగ్గొడుతున్న వారి ముక్కు పిండి బాకీలు వసూలు చేసేలా కఠిన చట్టాలు రూపొందించాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ విడనాడాలని కార్మిక వర్గం, దేశభక్తి కలిగిన ప్రజలు ఉవ్వెత్తున పోరాటాలు నిర్వహించాల్సి వుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో అంటే 2023లో బ్యాంకుల ప్రైవేటీకరణ షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశ విశాల ప్రయోజనాలను పట్టించుకోకుండా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించే చర్యలు తీసుకుంటుండడం సమర్ధనీయం కాదు!! ఆర్థికమంత్రి ప్రకటన బట్టి ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటుపరం చేయడం ప్రభుత్వ ప్రాధమ్యంగా మారిందని అర్థం అవుతోంది.

1969కి ముందు అనేక సందర్భాలలో పార్లమెంటులో వామపక్ష పార్లమెంట్ సభ్యులు బ్యాంకులను జాతీయం చేయాలన్న డిమాండును లేవనెత్తుతూ వచ్చారు. దేశంలో ఆదాయాల పంపిణీ ఏ తీరుగా ఉందో అధ్యయనం చేసిన పి.సి.మహల్‌నోబిస్ కమిటీ 1960 నాటికి దేశంలోని పది శాతం మంది సంపదలో 40 శాతం వాటా పొందుతున్నారని తేల్చింది. దేశంలో గుత్తసంస్థల తీరును అధ్యయనం చేసిన మోనోపలీస్ ఎంక్వైరీ కమిషన్ 1964 నాటికి దేశంలోని పరిశ్రమలలో 85 శాతం కొద్దిపాటి గుత్తసంస్థల చేతుల్లో ఉన్నాయని తెలిపింది. 1947-1951 మధ్య 205 ప్రయివేటు బ్యాంకులు బోర్డులు తిప్పేశాయి. 1951లో 567 ప్రయివేటు బ్యాంకులు ఉంటే 1969 నాటికి అవి కాస్తా 91 అయ్యాయి. ప్రైవేటు బ్యాంకులెంత దివాలా తీశాయో దీనినిబట్టి స్పష్టం అవుతున్నది.

1969లో బ్యాంకుల జాతీయకరణపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఆనాడు యువ పార్లమెంట్ సభ్యునిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి పాల్గొని, బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకిస్తూ 4 అంశాలు పేర్కొన్నారు. బ్యాంకుల జాతీయకరణ ఒక వికృతమైన చర్య అని, అవసరం లేనిదనీ అకారణమైనదనీ, అనుచితమని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థల పట్ల బిజెపి వైఖరికి నిలువెత్తు తార్కాణం. అయితే, ఆనాడు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు బ్యాంకు జాతీయకరణకు పట్టు పట్టడం వల్లనే అది సాకారం అయ్యింది.

బ్యాంకుల జాతీయకరణ (1969, 1980) జరిగిన నాటి నుండి బ్యాంకింగ్ రంగం గణనీయంగా పురోగతి సాధించింది. 1969లో మన దేశంలో మొత్తం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్ల మొత్తం రూ. 5000 కోట్లు కాగా, 2021 నాటికి అవి రూ.157 లక్షల కోట్లకు పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున బ్యాంక్ శాఖలు ప్రారంభించిన ఘనత ప్రభుత్వ రంగ బ్యాంకులదే. 1969లో మొత్తం బ్యాంక్ శాఖల సంఖ్య 8000 కాగా, 2021 నాటికి ఆ సంఖ్య 1,18,000కు పెరిగింది. ఆర్థిక వ్యవస్థలో కీలక రంగాలైన వ్యవసాయం, గ్రామీణాభివద్ధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాలు విశేష ప్రయోజనం పొందడంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలకపాత్ర పోషించాయి.

దేశంలో బ్యాంకింగ్ రంగ చిత్రం 1991 నుండి పెనుమార్పులకు లోనయింది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం ప్రారంభించాయి. ఎవరికైనా రూ. ఒక కోటికి మించి రుణం ఇవ్వాలంటే రిజర్వుబ్యాంకు నుండి ముందస్తు అనుమతి ఉండాలన్న నిబంధనను తొలగించారు. వ్యవసాయం, సంబంధిత రంగాలకు, బలహీన వర్గాలకు రుణాలు ఇవ్వడం ప్రథమ ప్రాధాన్యతగా ఉండాలన్న విధానాన్ని ఆచరణలో అమలు చేయకుండా నీరుగార్చారు. గుత్తపెట్టుబడుల నిరోధ చట్టం (ఎంఆర్‌టి.పి యాక్టు)ను రద్దుచేశారు. క్రమేపీ బ్యాంకింగ్ రంగంలో విదేశీ పెట్టుబడుల శాతాన్ని 74 శాతానికి పెంచారు. అనేక ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటాలను దాదాపు 40 శాతం పైగా అమ్మివేశారు. దీంతో బ్యాంకుల ప్రైవేటీకరణకు మార్గం సుగమం అయ్యింది. 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో అభివద్ధి చెందిన దేశాలన్నింటిలోనూ వందల సంఖ్యలో ప్రైవేట్ బ్యాంకులు దివాలా తీశాయి. 180 ఏళ్ల చరిత్ర కలిగిన లెహమాన్ బ్రదర్స్, జెపీ మోర్గాన్ ఛేజ్, గోల్డ్ మ్యాన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, మెరిన్ లించ్, లాయిడ్స్, బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ వంటి అంతర్జాతీయ బ్యాంకింగ్ దిగ్గజాలు సైతం కేవలం మొండి బకాయిల కారణంగా కుప్పకూలాయి. ఇవన్నీ ప్రభుత్వ ఉద్దీపన ప్యాకేజీ ద్వారా, ప్రజల సొమ్మును వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మాత్రమే నిలదొక్కుకున్నాయి.

2008 ఆర్థిక సంక్షోభం నుంచి మన దేశం నిలదొక్కుకొని గట్టెక్కడానికి ప్రభుత్వరంగ బ్యాంకులే ముఖ్య కారణమని ప్రపంచ దేశాలు కొనియాడాయి. మరి మన దేశంలో ప్రైవేటీకరణ తర్వాత మన బ్యాంకులు దివాలా తీస్తే వాటికి జవాబుదారు ఎవరు? ప్రజల సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణ దేశాభివద్ధిని వెనుక బాట పట్టించడమే గాక, ప్రజల కష్టార్జితాన్ని, విలువైన పొదుపును ప్రయివేటు వారికి, కార్పొరేట్లకు అప్పగించడం అవుతుంది. ప్రైవేటీకరణ సమర్ధకులు ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలను సమర్థించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులపై లేనిపోని అభాండాలను మోపుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాల్లో ఉన్నాయన్న వాదనలు ఈ కోవలోనివే. గత మూడేళ్ళుగా ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2 లక్షల కోట్ల నిర్వహణ లాభాలు ఆర్జిస్తున్నాయి.గత పదిహేనేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్జించిన మొత్తం నిర్వహణ లాభాలు రూ. 20,43,278 కోట్లు.

ప్రభుత్వ పెద్దల అనుయాయులు బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులు భారీగా ఎగ్గొట్టడం వల్ల మాత్రమే, ప్రభుత్వ రంగ బ్యాంకులకు నష్టాలు వస్తున్నాయి. గత ఆరేళ్లలో ప్రభుత్వ బ్యాంకుల 11 లక్షల కోట్ల రూపాయల పారు బకాయిలను మాఫీ చేశారు. ప్రభుత్వ బ్యాంకుల పారు బకాయిల్లో 73 శాతం హెయిర్ కట్ చేస్తున్నారు. 'హెయిర్ కట్' పేరుతో భారీ బకాయిలు పడిన సంస్థలను అతితక్కువ మొత్తం చెల్లించి బడా గుత్తసంస్థలు చేజిక్కించుకోగలుగుతున్నాయి. ఇది ఉద్దేశ్య పూర్వకంగా బ్యాంక్ రుణాలు ఎగ్గొడుతున్న బడా బాబులపై ప్రభుత్వాలకున్న జాలి, దయ!!

రైల్వేల తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం. దేశంలో పెద్దఎత్తున వ్యవసాయ రంగానికి రుణాలిచ్చి వెన్నుదన్నుగా నిలుస్తున్నది ప్రభుత్వ బ్యాంకులే. చదువుకున్న, వెనుకబడిన, షెడ్యూల్డ్ కులాల వ్యక్తులకు రిజర్వేషన్ల ద్వారా ఉపాధి, ఆర్థిక సాయం కల్పిస్తున్నది ప్రభుత్వ బ్యాంకింగ్ రంగమే. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పేరుతో 50 కోట్లపై చిలుకు 'జన్‌ధన్' ఖాతాలను తెరిచింది ప్రభుత్వ బ్యాంకులే. కేంద్ర ప్రభుత్వం నిర్వహించమన్న సామాజిక పథకాలను కేవలం ప్రభుత్వ రంగమే నిర్వహిస్తోంది. ప్రధాన మంత్రి పేరు మీద ఉన్న జీవన జ్యోతి బీమా యోజన, జనశ్రీ బీమా యోజన పథకాలలో ఎల్ఐసి, ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థల భాగస్వామ్యం 96 శాతం ఉంటే, ప్రైవేటు బీమా సంస్థల భాగస్వామ్యం కేవలం 4 శాతం మాత్రమే. జన్ ధన్ యోజన పథకం లో ప్రభుత్వరంగ బ్యాంకుల వాటా 97 శాతం ఉంటే, ప్రయివేటు బ్యాంకుల వాటా కేవలం 3 శాతం. ఇవి ప్రభుత్వ గణాంకాలు!! నష్టాలు వచ్చే సామాజిక పథకాల్లో ప్రయివేటు బ్యాంకులు, బీమా సంస్థల పాత్ర నామమాత్రంగా ఉంది !! అయినా, ప్రభుత్వ రంగ బ్యాంకు, బీమా కంపెనీల ప్రైవేటీకరణకు ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగడం తీవ్ర అభ్యంతరకరం.

- పి.సతీష్, ఎఐఐఇఎ ఉపాధ్యక్షులు

స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

ప్రభుత్వ రంగ సంస్థలను చంపేస్తున్నారు

అదాని, అంబాని వంటి ప్రయివేటు వ్యక్తుల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను చంపేస్తున్నారు. నెహ్రూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా వర్ణిస్తే, ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు ఎప్పటికైనా చచ్చిపోతాయని, కొన్ని యవ్వనంలో, కొన్ని వృద్ధాప్యంలో చచ్చిపోతాయి అన్నట్టుగా ప్రవర్తించడం శోచనీయం. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టీల్ ఉత్పత్తి జరగటం వల్ల టన్ను ధర రూ.50 వేలు నుంచి రూ.55 వేలు మాత్రమే ధర పలుకుతోంది. అదే స్టీల్ పరిశ్రమ ప్రయివేటుపరమైతే టన్ను ధర రూ.లక్షల్లోకి వెళుతుందని గుర్తించాలి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఐడిబిఐఎల్‌ను నిర్వీర్యం చేయడంతో, ప్రస్తుతం ప్రయివేటు ఫార్మాసిటీ కంపెనీలు ప్రజల్ని ఎలా పిండుకుంటున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నాం. స్ట్రాటజిక్, నాన్ స్ట్రాటజిక్ అంటూ బలమైన సంస్థలను ప్రయివేటుకు అప్పగించే కుట్రలు మానుకోవాలి.

– జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షులు
స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)

నాటి ప్రధాని నెహ్రూ ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా పేర్కొనగా, నేటి పాలకులు వాటిని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు తహతహలాడటంపై విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జాతి సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను పోరాటాలతో కాపాడుకుంటామని వారు స్పష్టం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు, కొనేందుకు ఎవరొచ్చినా వారిని తరిమితరిమి కొడతామని హెచ్చరిస్తున్నారు. పబ్లిక్ సెక్టార్‌ను భావితరాలకు అందించేందుకు ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని పేర్కొన్నారు.

– ప్రజాశక్తి, ఉక్కునగరం విలేకరి

ప్రభుత్వ రంగంతోనే ఉద్యోగ భద్రత

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల కార్మికులు కనీస సౌకర్యాలను సాధించుకున్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్‌మెంట్ వంటి సౌకర్యాలను సాధించుకోగలిగాం. ఉక్కు పరిశ్రమలో కార్మికులకు ఉద్యోగ భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశం. కాంట్రాక్టర్ మారినా కార్మికుడు కొనసాగే విధంగా పోరాడి సాధించుకోగలిగాం. ప్రభుత్వ రంగ సంస్థ కావడం వల్ల పని భద్రత, సేఫ్టీ పక్కగా అమలవుతున్నాయి. ప్రయివేటు సంస్థల్లో కార్మికుల భద్రతను గాలికి వదిలేస్తారు. ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదమే దీనికి నిదర్శనం.

– జి.శ్రీనివాస్
అధ్యక్షులు
స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు)

ప్రభుత్వ రంగంతోనే సురక్షితం



కార్మికవర్గం ప్రభుత్వరంగంలోనే సురక్షితంగా ఉంటుంది. కార్మికులు అన్ని రకాలుగా ప్రయోజనాలు పొందాలన్నా, ఎలాంటి నియంతృత్వ పోకడకులకు పోకుండా సాఫీగా పనులు జరగాలన్నా ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు ఉండడం అత్యంత అవసరం. ప్రభుత్వ రంగంలోని కార్మికుల మనుగడ ప్రశాంతంగా కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ రంగాన్ని నియంత్రించాలని చూడటం దుర్మార్గం. ఈ చర్యలను ఐక్యంగా కార్మిక వర్గం తిప్పికొడుతుంది.

– మంత్రి రాజశేఖర్
స్టీల్‌ప్లాంట్
ఐఎన్‌టియుసి నాయకులు

ప్రభుత్వ రంగంతోనే సమాన హక్కులు

రాజ్యాంగం చెప్పిన మేరకు ప్రతి ఒక్కరూ సమాన హక్కులు పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడలో ఉండాలి. భవిష్యత్తు తరాలు మెరుగైన జీవన విధానాన్ని పెంపొందించుకోవడానికి ప్రభుత్వ పరిశ్రమలు దోహదపడతాయి. అన్ని రంగాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఐక్యంగా పోరాడి కార్మిక హక్కులను సాధించుకోగలుగుతారు. నూతన కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మిక హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయి. నియంతృత్వ పోకడలను మానుకొని ప్రభుత్వ రంగ పరిశ్రమ పరిరక్షణ చేపట్టి, 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి.

– డి.ఆదినారాయణ
స్టీల్‌ప్లాంట్ ఎఐటియుసి నాయకులు

రేపటి తరానికి ప్రభుత్వ ఆస్తులు ప్రశ్నార్థకమే

సామాజిక, ఆర్థిక, కుల అసమానతలు రీత్యా మన దేశంలో ప్రయివేటు రంగ పెట్టుబడులు పనికిరావు. భారత ప్రభుత్వరంగ సంస్థలను, సంబంధిత ఆస్తులను, ప్రకృతి సహజ వనరులు మొత్తం ప్రయివేటు యాజమాన్యాల హక్కుల కిందకు బదిలీ చేస్తూ అమ్మేస్తుండటం వల్ల ఇక రేపటి తరాలకు ప్రభుత్వ ఆస్తులు అంటూ ఏమీ మిగలవు. ప్రభుత్వం సామాజిక బాధ్యతగా అమలుచేస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్, మాజీ సైనికులు, వికలాంగులకు విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు ప్రయివేటు రంగంలో ఉండవు. సామాజిక, ఆర్థిక సమన్యాయం జరిగేంత వరకు మన దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఉండి తీరాలి.

– పరంధామయ్య
యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పోరాటంతోనే నిలబడిన బిహెచ్‌పివి

ఎస్.జ్యోతీశ్వరరావు,
పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్

కేంద్ర ప్రభుత్వం 1991లో తెచ్చిన నూతన ఆర్థిక విధానాలతో బిహెచ్‌పివి కష్టాల్లో పడింది. వర్క్ ఆర్డర్ రాకపోవడం, ఎల్ అండ్ టి లాంటి పరిశ్రమలు పోటీకి రావడం పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడింది. కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది.

1966 జూన్ 25న బిహెచ్‌పివి ఏర్పాటుకు అప్పటి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. తర్వాత 4000 మంది పర్మినెంట్ ఉద్యోగులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేసేవారు. నూతన ఆర్థిక విధానాల తర్వాత బిహెచ్‌పివి పరిస్థితి దిగజారుతూ వచ్చింది. పిఎఫ్ లోనులు ఇచ్చేవారు కాదు. కో-ఆపరేటివ్ సొసైటీలు దివాళా తీశాయి. 2001లో సిఐటియు, ఐఎన్‌టియుసి ఫ్రాక్షన్, బిహెచ్‌పివి ఎంఎస్ ఫ్రాక్షన్ కలిసి ఉమ్మడిగా యూనియన్ ఎన్నికలలో పోటీచేశాయి. గౌరవాధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు గెలిచారు. ఆ ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావును ఓడిపోయారు. ఈ కాలంలోనే ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కంపెనీలో పెద్ద పోరాటాలు జరిగాయి. కుటుంబాలతో సహా పోరాటంలోకి వచ్చారు. ఆనాడు కేంద్రంలోఉన్న వాజ్‌పాయ్ నేతృత్వంలోని బిజెపి, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వాల నుంచి సహాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో బేరసారాలు జరిపింది. బిహెచ్‌పివిని కొనుగోలు చేయడానికి ఎల్ అండ్ టి కంపెనీని అధికారికంగా కేంద్రం పంపించింది. బిహెచ్‌పివిలోకి ఎల్ అండ్ టి కార్మికుల రాకను కార్మికులు వ్యతిరేకించారు. వచ్చిన వారిని వచ్చినట్లుగా కార్మికులు వెంటబడి తరిమి కొట్టారు. ఎల్ అండ్ టి అధికారులు పలాయనం చిత్తగించారు. కేంద్రంలో ఉన్న వాజ్‌పాయ్ ప్రభుత్వం ప్లాన్ మార్చుకొని ఎల్ అండ్ టి నుంచి ఒక అధికారిని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసి బిహెచ్‌పివికి పంపించింది. వచ్చిన ఎమ్‌డి కర్మాగారానికి వర్క్ ఆర్డర్లు తేకుండా, కార్మికులకు పని లేకుండా కుట్రకు పూనుకున్నాడు. ఎమ్‌డి మోసాన్ని సిఐటియు గుర్తించి, మే డే రోజున జెండా ఎగురవేసి, మేనేజింగ్ డైరెక్టర్ గోబ్యాక్ నినాదాన్ని ఇచ్చిది. హైవే నుంచి బిహెచ్‌పివి అడ్మిన్ బిల్డింగ్ వరకు ప్రదర్శన చేసింది. పెద్దపెట్టున నినాదాలతో నిరసన చేపట్టింది. ఎమ్‌డిని బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. అప్పటి నుంచి ఉద్యమం ఊపందుకుంది. కొన్ని నెలలకు ఎమ్‌డి రాజీనామా చేసి వెళ్లి పోయాడు. ఆ సమయంలో దేశంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో టిడిపి ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచింది. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో వామపక్షాల సహకారంతో యుపిఎ-1 ప్రభుత్వం ఏర్పాటైంది. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బిహెచ్‌పివి టౌన్‌షిప్ స్థలం కొంత భాగం అమ్ముకొని అప్పులు తీర్చుకొని కర్మాగారం నడుపుకోవచ్చు కదా అని సలహా ఇచ్చింది. దీన్ని సిఐటియు వ్యతిరేకించింది. పోరాడింది. సీతారాం ఏచూరి జోక్యంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం భెల్‌లో విలీనం చేయడానికి అంగీకరించింది. ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటుచేసి 2018 మే 10న బిహెచ్‌పివిని భెల్ యాజమాన్యం టేకోవర్ చేసుకుంది. ఇప్పుడు మహరత్నగా కొనసాగుతోంది. భెల్ 17వ యూనిట్‌గా ఉంది.

బిహెచ్‌పివికి కూత వేటు దూరంలో ఉన్న హిందూస్తాన్ జింక్ పరిశ్రమ 1977 మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభించి బాగా నడిచింది. కేంద్రంలోని వాజ్‌పాయ్ ప్రభుత్వం జింక్ పరిశ్రమను ప్రయివేటు సంస్థ అయిన వేదాంతకు అప్పగిచ్చింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా యూనియన్ ప్రతిఘటించినా దీర్ఘకాలం కొనసాగలేదు. ప్రయివేటీకరణ ఫలితంగా ప్రస్తుతం ఆ పరిశ్రమ మూతపడింది.

ప్రభుత్వ రంగంతోనే ప్రయోజనం

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలకు ఒక చారిత్రక ఆధిపత్యం ఉంది స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రణాళికల ద్వారా ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేయాలన్న బొంబాయి ప్రణాళికలు పక్కనబెట్టి, నాటి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ,అతని మంత్రివర్గ సహచరుడు అంబేద్కర్ ప్రభుత్వ రంగ అవసరాన్ని గుర్తించారు. సామ్యవాద అనుకూలురైన వీరిద్దరూ 1948లో పారిశ్రామిక విధానం రూపొందించి, ఆర్థిక వ్యవస్థ స్వతహాగా ముందుకు సాగాలంటే పరిశ్రమలను మూడుభాగాలుగా ఏర్పాటు చేయాలని భావించారు. ముఖ్యమైన భారీ పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలోనూ, మరికొన్ని మిశ్రమరంగంలోనూ, చిన్న తరహా వంటి పరిశ్రమలు ప్రైవేటు రంగంలోనూ ఉండాలని నిర్ణయించారు బడ్జెట్‌లో అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చి, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో పోటీపడి స్టీల్, సిమెంట్, భారీయంత్ర సామాగ్రి వంటి పరిశ్రమలను ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేశారు. 2008లో ఆర్థిక సంక్షోభం తర్వాత భారత వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రభుత్వరంగ అవసరాన్ని గుర్తించాయి. వైవిధ్యభరితం, విభిన్న కులాలు,మతాలకు నెలవైన మనదేశంలో పరిశ్రమల అభివృద్ధి, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే లాభాపేక్ష లేని ప్రభుత్వరంగ సంస్థల వల్లే సాధ్యం. అయితే కార్పొరేట్లు, ప్రైవేటు పెట్టుదారుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న నేటి ప్రభుత్వాలు, ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పన్నుతున్నాయి. బహుజనులకు రిజర్వేషన్లు, ఆర్థికప్రయోజనాలు చేకూరాలంటే, పరిశ్రమల నిర్వహణ ప్రభుత్వ రంగంలోనే ఉండాల్సిన అవసరం ఉంది. ఆ దిశలో సాగుతున్న ఉద్యమాలు,పోరాటాలను ఆహ్వానించి, భాగస్వాములు కావడం అందరి బాధ్యత

ప్రొఫెసర్ కెఎస్.చలం, ద్రవిడ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్

ప్రభుత్వ రంగంలోనే బాధ్యత

ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమలకు రక్షణ, బాధ్యత ఉంటుంది. సమాజంలోని ప్రతి తరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏకరీతిగా బాధ్యత వహిస్తుంది. ప్రభుత్వాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. పబ్లిక్ అండర్‌టేకింగ్‌లు ప్రభుత్వానికి సంపాదిస్తాయి. ఇది పౌరులందరికీ ఆరోగ్యం, విద్య, గృహాలను చూసుకుంటుంది. ప్రభుత్వ రంగంలో బడుగుబలహీన వర్గాలను పరిగణనలోకి తీసుకుంటారు. మరోవైపు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రయివేటు రంగం తమకుతామే సంపాదిస్తోంది. వైజాగ్ ఉక్కు కర్మాగారం వంటి ప్రభుత్వ పరిశ్రమలు పేద, బలహీన వర్గాలతో సహా అనేక మంది స్థానిక ప్రజలు, కార్మికుల త్యాగాలతో నిర్మించబడ్డాయి. పెద్ద మొత్తంలో ఉపాధిని సృష్టించడానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అలాంటి ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ హామీలకు దూరంగా ఎలా వెళ్తుంది. మనది గొప్ప దేశం, భారతదేశం ఒక రిపబ్లిక్. అంటే అది ప్రజలచే ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రజల సంక్షేమాన్ని, వారికి ఇచ్చిన హామీలను తిరస్కరించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. ప్రజలందరి సంక్షేమం పబ్లిక్ అండర్‌టేకింగ్‌తో సాధ్యమవుతుంది. ఇది ప్రైవేట్ రంగం ద్వారా కాదు.

- జిఎస్ఎన్.రాజు,
వైస్ ఛాన్సలర్,
సెంచూరియన్ యూనివర్సిటీ

తెలుగు ప్రజల హక్కు.. విశాఖ ఉక్కు

(3వ పేజీ తరువాయి..) 2015 వరకు సుమారు రూ.12,900 కోట్లు లాభాలు వచ్చాయి. ప్రభుత్వం కేటాయించిన సొమ్మును ప్లాంట్ తిరిగి చెల్లించగలిగింది. అనంతరం మిగులు సొమ్ముతో పాటు, రూ. 18 వేల కోట్లకు పైగా అప్పుచేసి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి స్టీల్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 2008 నుంచి 2019 వరకు 10 వేల పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. నిర్వాసిత కుటుంబాలకు, ఎస్‌టి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మాజీ సైనిక ఉద్యోగులు, మహిళలు, వికలాంగులకు ఉద్యోగాలు లభించాయి.

వెంటాడుతున్న ముడి ఖనిజ సమస్య

ప్లాంట్ సామర్ధ్యం పెంచుకున్నా, ముడిఖనిజం సమస్య స్టీల్‌ప్లాంట్‌ను వెంటాడుతూనే వుంది. కేంద్రప్రభుత్వం దేశంలోని ప్రైవేటు, ప్రభుత్వ స్టీల్ పరిశ్రమలతోపాటు, స్టీల్‌ప్లాంట్ నిర్మాణమే చేపట్టని పోస్కోకు సైతం ఐరన్‌ఓర్ గనులు కేటాయించింది గానీ, పభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నేటికీ ఐరన్‌ఓర్ కేటాయించలేదు. సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్లకు ఒక టన్ను ఉత్పత్తికి కేవలం రూ.500 ఖర్చు అవుతుండగా, విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో ఐరన్ ఓర్ టన్నును రూ.5 వేల నుంచి రూ.8 వేలకు కొంటోంది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

సెయిల్ నుంచి నుంచి స్టీల్‌ప్లాంట్‌ను వేరుచేసినప్పుడు బైలదిల్లాలోని 4, 5 బ్లాకుల గనులను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించి, ఐరన్ ఓర్ సరఫరా చేస్తామని నమ్మబలికారు. అయితే మన రాష్ట్రంలోని ఐరన్ ఓర్ గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని సిఐటియు హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరశింహారెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని నాటి ప్రభుత్వానికి ఆదేశించారు. అయినా గనులు కేటాయించకుండా. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు పాల్జేస్తున్నాయి. సముద్ర తీరాన స్టీల్‌ప్లాంట్ నిర్మించినట్టయితే రవాణాకు అనుకూలమై, అత్యంత తక్కువ ఖర్చుతో ముడిసరుకును దిగుమతితోపాటు, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను చౌకగా ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చని భావించారు. అనుబంధంగా పిపిపి విధానంలో గంగవరంలో పోర్టు నిర్మించినా, దాన్ని అదానీకి కట్టబెట్టారు. ఆ ప్రభావం స్టీల్‌ప్లాంట్‌పై పడింది. ముడిసరుకు రాకుండా ఇబ్బందులను సృష్టించడంతో రూ.మూడు వేల కోట్లు పైగా నష్టం వాటిల్లింది.

పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఆధునిక దేవాలయాలంటూ నాటి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, వ్యాపారం ప్రభుత్వ పని కాదంటూనే ప్రభుత్వ సంస్థలు చావడానికే పుట్టాయంటూ మోడీ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో ఏర్పాటైన వీటిని పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని 2021 జనవరి 27న నిర్ణయించింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కుపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగా ఆధారపడి సుమారు లక్ష మంది జీవిస్తున్నారు. రాష్ట్రంలోనే అధిక తలసరి ఆదాయం గాజువాకకు ఉండడానికి విశాఖ ఉక్కు కారణం. అయినా దీన్ని ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తుండటంతో కార్మికవర్గం అలుపెరగని పోరాటం చేస్తోంది. ఆ ఉద్యమాన్ని పట్టించుకోకుండా.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తామంటూ మోడీ సర్కారు ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సరఫరాను కావాలనే నిలిపేసి, బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసేసి ఉత్పత్తి పడిపోయేలా చేస్తోంది. ఉద్యోగులపై ఆర్థిక దాడి చేస్తోంది. ఆరు నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించడంలేదు.

ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో బయటకు పంపే కుట్ర చేస్తున్నారు. నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలు సాగుతున్నాయి. ప్లాంట్‌ను రక్షిస్తామని హామీనిచ్చి గెలిచిన టిడిపి కూటమి ప్రభుత్వం నేడు నాన్చుడు వైఖరి అవలంబిస్తోంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయించాలని చంద్రబాబు, పవన్‌లను కార్మికవర్గం డిమాండ్ చేస్తోంది.

ప్రభుత్వ రంగ సంస్థల రూపశిల్పి,
సోషలిస్టు, సెక్యులర్ భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి
సందర్భంగా ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

ప్రభుత్వ బీమా రంగాన్ని
బలోపేతం చేయండి.
ప్రభుత్వ రంగ సంస్థల
ప్రైవేటీకరణను తిప్పికొట్టండి.

INSURANCE CORPORATION
aiiea EMPLOYEES' UNION SCZIEF
VISAKHAPATNAM DIVISION

ప్రభుత్వ రంగ సంస్థల రూపశిల్పి,
సోషలిస్టు, సెక్యులర్ భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి
సందర్భంగా ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం..
సహకార వారోత్సవాలను జయప్రదం చేద్దాం.



BOARD OF MANAGEMENT
THE INDIAN NAVY CIVIL EMPLOYEES
CO-OPERATIVE SOCIETY LTD.,
Regd. No. B.1107
D-Block, 2nd Floor, HQENC Annexe Building, Naval Base, Visakhapatnam-530 014.
Ph : 0891-2812661, 2754473, Cell : 9848608953, 9553150354
Website : www.inecs.com E-Mail id : incecs@gmail.com

ప్రభుత్వ రంగ సంస్థల రూపశిల్పి,
సోషలిస్టు, సెక్యులర్ భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతి
సందర్భంగా ఆయన స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

ప్రభుత్వ రంగసంస్థల
ప్రైవేటీకరణను
తిప్పికొట్టండి.

HPCL EMPLOYEES' UNION
Regd. No. D-1706/98
Affiliated to CENTRE of INDIAN TRADE UNIONS
RECONGNISED UNION
HPCL, VISAKH REFINERY, VISAKHAPATNAM, A.P